నవతెలంగాణ

1

మెదక్

శనివారం | 02 సెప్టెంబర్ 2023 | www.navatelangana.com

ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డిని సన్మానించిన వీవోఏలు



నవతెలంగాణ-మిరుదొడ్డి

రాష్ట్ర ప్రభుత్వం గ్రామస్థాయిలో పనిచేస్తున్న వీవోఏలకు వేతనాలు పెంచడం సంతోషకరమని వీవోఏల రాష్ట్ర నాయకులు యమున, మిరుదొడ్డి మహేష్‌లు అన్నారు. ఈ మేరకు మిరుదొడ్డి మండల కేంద్రంలో మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డిని కలిసి శాలువా తో సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ తమకు వేతనాలు పెంచడం సంతోషకరవన్నారు. మంత్రి హరీశ్‌రావు, ఎర్రవల్లి దయాకర్ రావు, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డిలకు ఎల్లవేళలా అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ లక్ష్మీ లింగం, ఎంపీపీ సాయిలు , ఆత్మ కమిటీ చైర్మన్ భాస్కరాచారి, భిక్కి వెంకటయ్య , వెంకటలక్ష్మీ స్వప్న మంగమ్మ కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

సహనంతో ఒత్తిడిని జయించవచ్చు



నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్

నేటి ఆధునిక సమాజంలో మనిషి అవసరమైన దానికన్నా ఎక్కువగా ఆలోచించి, అనవసరంగా పరుగులు పెడుతూ అనారోగ్యాన్ని కోని తెచ్చుకుంటున్నాడని.. సహనంతో ఒత్తిడిని జయించవచ్చని సీపీ ఎన్.శ్వేత అన్నారు. పోలీస్ కన్వెన్షన్ సెంటర్‌లో ఒత్తిడిని ఎలా అధిగమించాలనే అంశంపై పోలీస్ అధికారులకు శుక్రవారం వన్ డే వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లా పోలీస్ అధికారులకు, సిబ్బందికి పోలీస్ హెల్త్ ప్రాజెక్ట్, పోలీస్ ఆరోగ్య రక్ష కార్యక్రమాన్ని చేపట్టి 57 రకాల రక్త పరీక్షలు చేయించగా.. కొంతమందికి ఊబకాయం, బీపీ, షుగర్, చిన్న చిన్న ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు మెడికల్ రిపోర్టులు వచ్చాయన్నారు. వారిని మానసిక ఒత్తిడి నుండి దూరం చేసే విధంగా ఈ వర్క్ షాప్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ అందె శ్రీనివాసరావు, అడిషనల్ డీసీపీ ఎస్. మల్లారెడ్డి, ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్, ఏసీపీలు రమేష్, సతీష్, సురేందర్ రెడ్డి, చంద్రశేఖర్, రవీందర్ రాజు, ఎస్బి ఇన్స్పెక్టర్ రఘుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విషపు పాలు





'ఆరోగ్యమే మహా భాగ్యం' అన్నారు పెద్దలు. మరి మన ఆరోగ్యాలను విషపు పాలు పాడు చేస్తున్నాయి. స్వచ్ఛమైన పాలు, పాల పదార్థాల పేరిట జరుగుతున్న దందా మన ఉనికినే ప్రమాదలోకి నెడుతున్నాయి. ఐదారు రూపాల్లో కల్తీ చేయబడుతున్న పాలు తాగి మన ఆరోగ్యాలను మనమే పాడు చేసుకుంటున్నాం. రకరకాల బ్రాండ్ల పేరిట మార్కెట్లో పాలు, పాల ప్యాకెట్ల విక్రయాలు సాగుతున్నాయి. పెద్ద పెద్ద కంపెనీల పాలు సైతం కల్తీ చేయబడుతున్నాయి. పాలు-నీళ్లలా కలిసిపోవాలంటారు. పాలలో కొద్దిపాటి నీళ్లు కలిస్తే పర్వాలేదు. కానీ..! కాలకూట విషాలను కలుపుతూ కల్తీ పాలను మనకు అంటగడుతున్నారు. పాలు పౌష్టికాహారంగా బావించి పిల్లలు, పెద్దలం తాగుతున్నాం. పాలతో టీ, కాఫీ, పెరుగు, వెన్న, నెయ్యి తయారవుతోంది. వాటిని తీసుకునే మనిషి ఆరోగ్యం గుల్లవుతోంది. కల్తీ పాల దందాను అరికట్టాల్సిన ఆహార తనిఖీ అధికారులు మామూళ్ల మత్తులో మునుగుతున్నారు.

- ఐదు రూపాల్లో పాల కల్తీ
- నిత్యం లక్షల లీటర్ల పాల వినియోగం
- పిల్లలు, పెద్దల అరోగ్యంపై తీవ్ర ప్రభావం
- పెద్ద బ్రాండ్ల ప్యాకెట్ పాలు మరీ ప్రమాదకరం
- తనిఖీలు పట్టని ఫుడ్ ఇన్స్‌స్పెక్టర్

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

పొద్దున లేవగానే పాలు, పాల ప్యాకెట్ కోసం వెళ్తాం. మార్కెట్‌లో లభించి వివిద రకాల పాలను తెచ్చుకుని టీ, కాఫీ చేస్తాం. పెరుగు కోసం తోడేస్తం. ఇలా ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా ప్రతి కుటుంబం రోజూ పాలను వినియోగిస్తుంది. 35 లక్షల జనాబా కల్గి ఉన్న ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా రకరకాల బ్రాండ్ల పేరుతో నిత్యం లక్షలాది లీటర్ల పాల విక్రయాలు జరుగుతున్నాయి. స్థానికంగా పాల ఉత్పత్తిదారుల నుంచే కాకుండా వివిద కంపెనీల పాలు వినియోగిస్తున్నాం. దొడ్ల, తిరుమల, హెరిటేజ్, అమ్మూల్, ఆరోక్య, విజయ, నాగార్జున ఇతర అనేక పేర్లలో పాల విక్రయాలు సాగుతున్నాయి. ఏపీ, కర్ణాటక, మహారాష్ట్రతో పాటు తెలంగాణలో తయారయ్యే పాలు విక్రయిస్తున్నారు. స్థానికంగా కొందరు పాలు తయారు చేసి విడి పాలుగా అమ్ముతున్నారు. దొడ్ల నుంచి పిండి తెచ్చిన పాలంటూ పెద్ద పెద్ద క్యాన్లల్లో తెచ్చి కాలనీలు, వివిద కూడళ్ల వద్ద, పాల షాపుల వద్ద విక్రయిస్తున్నారు. నిత్యం టీ, కాఫీ కోసం పాలను వినియోగిస్తుంటున్నారు. అదే విధంగా హెూటళ్లు, టీ కొట్టుల్లో పాలను పెద్ద ఎత్తున వినియోగిస్తున్నారు. ఆసుపత్రుల్లో రోగులు, హాస్టల్స్ విద్యార్థులు రోజు పాలు తాగుతున్నారు. కోవా, స్వీట్స్ ఇతర పాల పదార్థాలను తయారీలో వాడే పాలు కూడా కల్తీవే వాడుతున్న పరిస్థితి ఉంది.

కాలకూట విషం...కల్తీ పాలతో ఆరోగ్యానికి ముప్పు

పాలను అనేక రూపాల్లో కల్తీ చేస్తున్నారు. పాల కల్తీ దందాను పరిశీలిస్తే ఆరు రకాలుగా కల్తీ చేస్తు న్నట్లు తేలింది. పాలల్లో నీళ్లు కలపడం జరుగుతుంది. అలాగే యూరియాతో పాలు తయారు చేస్తున్నారు. సింథటిక్, స్టార్చ్, డిటర్జెంట్, ఫామాయిల్ నూనెను కలిపి పాలను తయారు చేస్తున్నారు. పాలలో నీళ్లు కలిపితే పాలు పలుచనవుతాయి. పెద్దగా ఆరోగ్యంపై ప్రభావం ఏమీ చూపదు. కానీ..! యూరియా, ఫామాయిల్ నూనె, సింథ టిక్, డిటర్జెంట్ పౌడర్లు, ఇతర పిండి పదార్థాలు, కెమికల్స్ కలపడతంతో ఆరోగ్యాలు పాడవుతున్నాయి. చిన్న పిల్లలు, వ్యాధిగ్రస్తులు, వృద్దుల ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయి. కాన్సర్ లాంటి ప్రమాదకర వ్యాధి బారిన పడే ప్రమా దముందని వైద్య నిపుణులు చెబుతున్నారు. హార్మోన్స్ ఇన్ బ్యాలెన్స్ వల్ల కూడా ఆడ పిల్లల ఆరోగ్యం, పెరుగుదలపై తీవ్ర ప్రభావం చూపుతుందని తేలింది. జీర్ణకోశ సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశముంది. ప్యాకెట్ పెరుగు తినడంతో ఆరోగ్యం దెబ్బ తింటుంది. కల్తీ పాలతో తయారు చేసే స్వీట్స్, చాకెట్స్, కేక్స్ వంటివి తినడం వల్ల కూడా ఆరోగ్యం దెబ్బతింటుంది.

కల్తీ దందా గుట్టు ఇలా...

విడి పాలు అమ్మేవాళ్లు సైతం నీళ్లను కలుపుతున్నారు. అలాంటి పాలను గమనించాలంటే వాలుగా ఉ న్న బండపై పాలు పోస్తే అవి మెల్లగా కదిలితే నీళ్లు కలవనట్లుగా గుర్తించాలి. కానీ..! జనం కొనే పాలు నీళ్లలా జారిపోతునే ఉంటాయి. కొన్ని సార్లు పాలు సబ్బు, నురగ వాసన వస్తుంటాయి. అంటే డిటర్జెంట్ రసాయనాలు కలిసినట్లే. అలాంటి పాలను చేతి పోసుకుని రుద్దితే నురుగు వస్తుంది. అలాగే సింథటిక్ కలుపుతున్నారు. తినే స్వీట్లు, అనే వంటల్లోనూ పాలను వినియోగిస్తారు. సింథటిక్ కలిపిన పాలతో కోవ తయారు చేస్తే ఘన కోవగా కాకుండా గట్టిగా ఉంటే అందులో కల్తీ ఉన్నట్లుగా గుర్తించవచ్చు. పాలు చిక్కగా ఉండేందుకు పిండి పదార్థాలు, స్టార్చ్‌ను కలుపుతున్నారు. అలాగే యూరియాతో కూడా పాలు తయారవుతున్నాయి.

తనిఖీలు పట్టని ఫుడ్ ఇన్స్‌స్పెక్టర్..

పాల ఉత్పత్తుల్లో నాణ్యతా ప్రమాణాలను తనిఖీ చేసి కల్తీ కాకుండా చూడాల్సిన ఫుడ్ ఇన్స్‌స్పెక్టర్ అధికారులు నిమ్మకునీరెత్తినట్టు ఉంటున్నారు. ఐదారు జిల్లాలకు ఒక ఫుడ్ ఇన్స్‌స్పెక్టర్ ఉన్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఉండే అధికారి మెదక్, సిద్దిపేటతో పాటు మరో నాలుగు జిల్లాలకు ఇంచార్జీగా ఉన్నారు. ఆయన రోజుకో జిల్లాలో పర్యటించాలన్నా వారం రోజులు సరిపోవు. దీంతో ఉమ్మడి జిల్లాలో జరిగే పా ల కల్తీ దందాను పసిగట్టలేకపోతున్నారు. నిత్యం అమ్ముడయ్యే కల్తీ పాల విక్రయాలపై కూడా నిఘా పెట్టట్లేదు.

బాధిత కుటుంబానికి చేయూత



నవతెలంగాణ-కొండపాక

కొండపాక గ్రామానికి చెందిన ఎర్రబోయిన వెంకటేశం అనే వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో అతని కుటుంబానికి గ్రామానికి చెందిన హనుమాన్ ట్రాక్టర్ డ్రైవర్స్ అసోసియేషన్ యూనియన్ వారు అండగా నిలిచి.. రూ.20 వేల ఆర్థిక సహాయం చేసి చేయూతనిచ్చారు.

మృతుని కుటుంబానికి కాంగ్రెస్ నాయకుల పరామర్శ



నవతెలంగాణ-మిరుదొడ్డి

కొండాపూర్ గ్రామానికి చెందిన బండి రాజయ్య అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవలే మృతి చెందాడు. మృతుని కుటుంబానికి దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆదేశాలతో మిరుదొడ్డి మండల కాంగ్రెస్ అధ్యక్షులు మద్దెల రాజేశం 50కిలోల బియ్యం అందజేశారు. మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు మద్దెల మహేశ్, గ్రామాధ్యక్షులు వై.రాజు, అంజయ్య, పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల డబ్బులు కాజేస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ ప్రభుత్వ హాస్పిటల్‌లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల నుంచి ప్రతీ నెలా రూ.1000 కట్ చేస్తున్న కాంట్రాక్టర్ పై చర్యలు తక్షణమే తీసుకోవాలని, ఈఎస్ఐ, పిఎఫ్ సమస్యను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ మహిపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కార్మికులతో కలిసి హాస్పిటల్ ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించి, వినతి పత్రం అందజేశారు. అనంతరం మహిపాల్ మాట్లాడుతూ.. కార్మికుల వద్ద నుంచి రూ.1000 కట్ చేస్తున్న కాంట్రాక్టర్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి బండి సుధాకర్,ఏలీషా, తదితరులు పాల్గొన్నారు.

17వ రోజుకు సెకండ్ ఏఎన్ఎంల సమ్మె



నవతెలంగాణ-సంగారెడ్డి

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా సెకండ్ ఏఎన్ఎంలు చేస్తున్న నిరవధిక సమ్మె 17వ రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా శుక్రవారం భిక్షాటన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయిని ప్రసాద్ మాట్లాడుతూ.. రెండ్రోజులుగా భిక్షాటన చేస్తూ.. ఏఎన్ఎంల పరిస్థితుల గురించి తెలియజేస్తున్నామన్నారు. అయితే ఏఎన్ఎంలను భయభ్రాంతులకు గురి చేసే విధంగా షోకోజు నోటీసులు పంపుతున్నారని.. ఇది సరికాదన్నారు. ప్రభుత్వం భేషరతుగా ఏఎన్ఏంల సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో రాములమ్మ, ప్రవీణ, పుష్పలత, తులసి, స్వప్న, సత్య పుణ్యమ్మ, పోచమ్మ తదితరులు పాల్గొన్నారు.

లోక్ ఆదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఝరాసంగం

కక్షలు, కార్పన్యాలకు వెళ్లకుండా రాజీ మార్గంలో వెళ్లి రాజమార్గాన్ని అనుసరించాలని ఎస్సై రాజేందర్‌రెడ్డి అన్నారు. నేటి నుంచి ఈనెల 09 వరకు నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో కక్షిదారులు హాజరై తమ కేసులను రాజీ చేసుకోవాలన్నారు.

ప్రతీ ఇంటి నుంచి మట్టి సేకరణ



నవతెలంగాణ-పటాన్‌చెరు

అజాది కా అమృత్ మహెూత్సవ్ కార్యక్రమంలో భాగంగా ప్రతీ గ్రామంలోని.. ప్రతీ ఇంటి నుండి చిటికెడు మట్టిని సేకరించి దేశ రాజధాని ఢిల్లీలో నిర్మించబోయే 'అజాదీ కా అమృత్ మహెూత్సవ్' స్థూపం కోసం ఉపయోగించనున్నట్టు పటాన్‌చెరు మాజీ జడ్పీటీసీ బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడీల శ్రీకాంత్ గౌడ్ అన్నారు. మండలంలోని ముత్తంగి పరిధి,లోని డి.ఎన్ కాలనీలో శుక్రవారం అజాది కా అమృత్ మహెూత్సవ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటి ఇంటికి వెళ్ళిమట్టిని సేకరించి ప్రతిఒక్క పౌరుడు భాగస్వామి అయ్యేలా చేస్తున్నామన్నారు.

ఇందిరాపార్కు వద్ద ధర్నాలో మండల ఉపాధ్యాయులు



నవతెలంగాణ-మునిపల్లి

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద శుక్రవారం జరిగిన మహా ధర్నాకు మునిపల్లి మండలం నుంచి ఉపాధ్యాయులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీపీఎస్‌ను రద్దుచేసి ఓపిఎస్‌ను పునరుద్ధరించాలన్నారు. బదిలీలు, ప్రమోషన్లు వెంటనే చేపట్టాలని.. 317 ద్వారా ఉపాధ్యాయులకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలన్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర కౌన్సిలర్ కమ్రుద్దీన్, జిల్లా కార్యదర్శి అశోక్, గోవర్ధన్, ప్రవీణ్, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నీలి లక్ష్మణ్, గోపాల్ కోరారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-కొండపాక

కొండపాక గ్రామానికి చెందిన ఎరోళ్ళ మల్లయ్య అనే వ్యక్తి ఇటీవల మృతి చెందాడు. ఆయన కుటుంబానికి భారత జాగృతి రాష్ట్ర కార్యదర్శి అనంతల ప్రశాంత్ పదివేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు.



అటెండర్ బండి నర్సింలు కు ఘన సన్మానం

నవతెలంగాణ-దుబ్బాక

దుబ్బాక పురపాలిక కేంద్రంలో గల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పిఏసిఎస్)లో గత 40 ఏండ్లుగా అటెండర్‌గా పనిచేస్తున్న బండి నర్సింలు రిటైరెమ్మెంట్ సందర్భంగా శుక్రవారం పీఏసీఎస్ చైర్మెన్ శేర్ల కైలాష్ ఆధ్వర్యంలో నర్సింలు దంపతులను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. సహకార సంఘానికి నర్సింలు అందిం చిన సేవలను కొనియాడారు. వైస్ చైర్మెన్ కాల్వ నరేష్,సభ్యులు ఆస బుధవ్వ, యాదగిరి, మణిపడిగే రేణుక, మైసారెడ్డి, ఎల్లారెడ్డి, కద్దూరి ప్రభాకర్ రెడ్డి,కాసం బాల్ రెడ్డి, చెలుకుల మధుసూదన్ రెడ్డి, భానోత్ రాంజ్యా, బాలరాజు, ఆఫీసు సిఈఓ మోహన్, సిబ్బంది కరుణాకర్,వేణు పలువురున్నారు.

చదువుతోపాటు క్రీడలూ అవసరం

- జెడ్పీ చైర్‌పర్సన్ రోజా శర్మ
- అట్టహాసంగా ప్రారంభమైన ఎస్‌జీఎఫ్ క్రీడలు



నవతెలంగాణ-కొండపాక

విద్యార్థి దశ నుంచి చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ వేలేటి రోజా రాధా కిషన్ శర్మ అన్నారు. కుకునూరుపల్లి మండల కేంద్రంలో ఎస్‌జిఎఫ్ క్రీడలు ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొనడం కోసం ఈ క్రీడలు తొలిమెట్టు లాంటివి అన్నారు. ఆటల్లో నైపుణ్యత పెంపొందించుకొని జాతీయ స్థాయి క్రీడలుగా ఎదిగి గ్రామానికి రాష్ట్రానికి పేరు తీసుకురావాలన్నారు. ఉన్నత చదువులకు సైతం స్పోర్ట్స్ కోటా ఉంటుందని దానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. యువతను క్రీడల్లో ప్రోత్సహించడానికి అన్ని గ్రామాల్లో గ్రామీణ క్రీడా ప్రాంగణాలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి హరీష్ రావు ప్రత్యేక కృషితో సిద్దిపేటలో క్రీడా మైదానాలు స్టేడియంలో ఏర్పాటు అయ్యాయని వాటిలో ఎంతో మంది క్రీడాకారులకు నైపుణ్యత పెంపొందించే అవకాశాలున్నాయన్నారు. విద్య వైద్యానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించి కృషి చేస్తుందన్నారు. పరిపాలన సౌలభ్యం కోసం కొత్త మండలాలు జిల్లాలను తెలంగాణ రాష్ట్రంలో ఏర్పాటయ్యాయని ఇది సీఎం కేసీఆర్ కృషితో జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్డసి చైర్మెన్ వంటేరు ప్రతాపరెడ్డి, డీఈవో శ్రీనివాసరెడ్డి, ఎంఈఓ శ్రీనివాసరెడ్డి పాఠశాల హెచ్ఎం బాలకిషన్, రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు వంగ నాగిరెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాధా కిషన్ శర్మ, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కందూరి ఐలయ్య, సర్పంచ్ పొల్కంపల్లి జయంతి నరేందర్, ఎస్‌జిఎఫ్ కార్య దర్శి రామేశ్వర్ రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మెన్ అమరేందర్, ఎస్ఎంసి చైర్మెన్ ఐలయ్య, పిఎన్ ఆర్‌సంస్థ చైర్మెన్ నరేందర్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

సబ్బండ వర్గాల సంక్షేమమే మా లక్ష్యం

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- రూ.90 లక్షలతో నిర్మించిన హుడా పార్కు ప్రారంభం



నవతెలంగాణ-రామచంద్రాపురం

కుల మతాలకు అతీతంగా అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా దూసుకెళ్తున్న పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి మరోమారు తన గొప్ప మనసును చాటుకున్నారు. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో శుక్రవారం ఏర్పాటు చేసిన వివిధ కార్యక్రమాల్లో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. యాదవ సంఘం నిర్మాణానికి రూ.30 లక్షలు, కురుమ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న బీరప్ప గుడికి 30 లక్షలు, విద్యుత్ నగర్ హనుమాన్ గుడికి ఐదు లక్షలు, ఇందిరానగర్‌లో చర్చి అభివృద్ధికి ఐదు లక్షల భారీ విరాళాలను జీవీఆర్ ఎంటర్ప్రైజెస్ తరపున అందజేశారు. అనంతరం రూ.90 లక్షలతో నిర్మించిన హుడా పార్కును ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సబ్బండ వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. కులం, మతం ప్రాంతం తేడా లేకుండా అన్ని వర్గాల ఆర్థిక అభ్యున్నతికి ఎల్లవేళలా తోడ్పాటు అందిస్తున్నామని తెలిపారు.ప్రజల ఆశీస్సులతో శరవేగంగా అభివృద్ధి చేపడుతున్నామని తెలిపారు. భవిష్యత్తులోనూ మరిన్ని అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతా మన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇటీవల మున్సిపాల్టీలకు ప్రకటించిన రూ.25 కోట్ల నిధులకు సంబ ంధించిన ప్రొసీడింగ్స్ విడుదల అయ్యాయన్నారు.ఈ కార్య క్రమాల్లో మున్సిపల్ చైర్మన్ లలితా సోమిరెడ్డి, వైస్ చైర్మన్ రాములు గౌడ్, మాజీ కార్పొరేటర్ అంజయ్య, ఆయా వార్డు ల కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షులు దేవేందర్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

అధికారుల హామీతో ఆందోళన విరమించిన కార్మికులు



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ మున్సిపల్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలకు పరిష్కారం, వారాంతపు సెలవులు, సబ్బులు, నూనెలు ఈఎస్ఐ,పిఎఫ్ ఇతర సమస్యల పరిష్కారానికి అధికారులు శుక్రవారం స్పష్టమైన హామీ ఇవ్వడంతో కార్మికులు ఆందోళనా కార్యక్రమాలను విమరించారు. నేటి నుంచి తలపెట్టిన విధుల బహిష్కరణను కూడా విరమిస్తున్నట్టు ప్రకటించారు. శానిటరీ ఇన్స్పెక్టర్ సంధ్య, ఇతర అధికారులు రవీందర్‌రెడ్డి తదితరులు సీఐటీయూ నాయకులు, కార్మికులతో చర్చలు జరిపి.. సబ్బులు, నూనెలు నేషనల్ ఫెస్టివల్ హాలిడేస్ ఇస్తామని, ఈఎస్ఐ, పిఎఫ్ సమస్య పరిష్కారానికి తక్షణమే పనులు ప్రారంభించడంతో హామీ ఇచ్చారని.. దీంతో ఆందోళన కార్యక్రమాలను విరమిస్తు న్నట్టు యూనియన్ అధ్యక్షులు, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మహిపాల్ తెలిపారు. కార్మికులు ఐక్యంగా ఉద్యమించడంతో అధికారులు స్పందించడం మంచి పరి ణామ మని.. తక్షణమే ఇచ్చిన హామీలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కామయ్య, సంజీవ్, చంటి, మోహన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మదన్‌రెడ్డికే టికెట్ ఇవ్వాలని..

వాటర్ ట్యాంక్ ఎక్కి యువకుల నిరసన



నవతెలంగాణ-హత్నూర

నర్సాపూర్ నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డికే మరోమారు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి టికెట్‌ను కేటాయించాలని డిమండ్ చేస్తూ.. మండల యువత విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మండల యువత విభాగం మండల అధ్యక్షులు తుమ్మలపల్లి కిషోర్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ రాష్ట్రవ్యాప్తంగా సిట్టింగ్ ఎమ్మెల్యేలకే టిక్కెట్లు కేటాయించి.. నర్సాపూర్‌ను మాత్రం పెండింగ్‌లో పెట్టడం ఏంటని ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యే మదన్‌రెడ్డి గత తొమ్మిదేండ్లుగా ప్రజల మధ్య ఉంటూ సీసీరోడ్లు, అండర్ గ్రౌండ్ మురికి కాలువలు, చెక్ డ్యాములు లాంటివి నిర్మిస్తూ.. నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేశారన్నారు. అంతేకాకుండా ఇతర పార్టీలో నుంచి వచ్చిన వారికి టికెట్ కేటాయిస్తే యువత విభాగ ఆధ్వర్యంలో సహించేది లేదని హెచ్చరించారు. మదన్ రెడ్డికి టికెట్ కేటాయిస్తే.. లక్ష మెజార్టీతో గెలిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు అధిష్టానం ఆలోచించి సిట్టింగ్ ఎమ్మెల్యే మదన్ రెడ్డికే టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కొల్లూరులో లబ్ధిదారులకు ఇండ్ల పంపిణీ ఏర్పాట్లు పూర్తి

- నేడు ముఖ్యఅతిథిగా హాజరుకానున్న మంత్రి హరీశ్‌రావు
- లాటరీ పద్ధతిలో బ్లాకుల కేటాయింపు
- లబ్ధిదారులతో ఎమ్మెల్యే ముఖాముఖి



నవతెలంగాణ-పటాన్‌చెరు

అగ్గిపెట్ట లాంటి అద్దె ఇల్లు... చాలీచాలని జీతాలతో జీవితం వెళ్లదీస్తున్న నిరుపేదలకు అత్యంత ఖరీదైన ప్రాంతంలో రూ.50 లక్షలు విలువ చేసే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను కట్టించి అందజేస్తున్న మహెూన్నత నాయకుడు ముఖ్యమంత్రి కేసీఆర్ అని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీలో భాగంగా పటాన్‌చెరు డివిజన్ల పరిధిలోని భారతి నగర్, రామచంద్రపురంలో తొలి విడతలో ఎంపికైన 500 మంది లబ్ధిదారులతో శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖాముఖి సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కులం, మతం, ప్రాంతం తేడా లేకుండా రాజకీయాలకు అతీతంగా పూర్తి పారదర్శకతతో అత్యంత ఆధునిక సాఫ్ట్ వేర్ సహాయంతో లబ్ధిదారులను ఎంపిక చేశామన్నారు. ఇళ్ల పంపిణీ నిరంతర ప్రక్రియ అని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇల్లను కేటాయించడం జరుగుతుందన్నారు. తొలి విడతలో ఎంపికైన 500 మంది లబ్ధిదారులకు కొల్లూరులో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను నేడు(శనివారం) లాటరీ పద్ధతిన బ్లాక్‌లు కేటాయిస్తారన్నారు. అనంతరం ఇళ్ల పత్రాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. పటాన్‌చెరుకు సంబంధించిన లబ్ధిదారులందరిని పటాన్‌చెరు మైత్రి మైదానం నుండి బస్సులు ఏర్పాటు చేసి కొల్లూరుకి తీసుకొని వెళ్తామన్నారు. సొంత నిధులతో 10,000 మందికి భోజనాలు ఏర్పాటు చేశానన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మెట్టు కుమార్ యాదవ్, పుష్ప నగేష్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ సురేష్, తహసీల్దార్, భాస్కర్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, బీఆర్ఎస్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం

- పేదల సంక్షేమం మరిచి.. పెట్టుబడిదారులకు మేలు చేస్తున్న కేంద్ర సర్కార్
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు



నవతెంగాణ-కొండాపూర్

కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై సెప్టెంబర్ 1 నుంచి 7వ తారీఖు వరకు దేశవ్యాప్తంగా సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం కొండాపూర్ మండలంలోని మునిదేవునిపల్లి గ్రామంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజ్ మాట్లాడుతూ.. నరేంద్ర మోడీ ప్రభుత్వం నిత్యవసర వస్తువుల ధరలు పెంచి పేద ప్రజల నడ్డి విరుస్తున్నదన్నారు. మోడీ పాలన పేదల సంక్షేమాన్ని మరిచి పెట్టుబడిదారి వర్గాలకు మేలు చేకూరుసున్నదని విమర్శించారు. రానున్న 5 రాష్ట్రాల్లో ఎన్నికలు ఉన్న నేపథ్యంలో గ్యాస్ ధరను రూ.200 తగ్గించారని.. ఇది కేవలం ఎన్నికల స్టంట్ మాత్రమే అన్నారు. దేశంలో ఉద్యోగాల్లేక నిరుద్యోగులకు ఎదురుచూపులు తప్పడం లేదన్నారు. ఉపాధి పథకానికి కేటాయింపులు కుదించడంతో కూలీల బతుకులు ఆగమాయ్యాయన్నారు. కుల, మత ఘర్షణలు తాండవిస్తున్నాయన్నారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఒక వైపు పేదల పై భారాలు వేస్తూ ప్రజావ్యతిరేక విధానాలను అమలు చేస్తూ, మరోవైపు కార్పొరేట్లు, పెట్టుబడిదారులకు లక్షల కోట్ల రూపాయలను రాయితీ ఇస్తున్నదన్నారు. రాష్ట్రాల హక్కులను హరిస్తున్నద న్నారు. నేటికి అనేక మంది ప్రజలు పేదరికంలో మగ్గుతున్నారన్నారు. వారిపై పన్నుల భారం పెంచి మరింత దారిద్ర్యంలోకి నెడుతున్నదని ఆరోపించారు. 2014లో ఉన్న నిత్యవసర ధరలను, నేటి ధరలను పరిశీలిస్తే.. 50 శాతం నుండి 200 శాతం వరకు సరుకుల ధరలు పెరిగాయన్నారు. కూరగాయల ధరలు ఈ నెలలోనే 37 శాతం వరకు పెరిగినట్టు చెప్పారు. కాబట్టి రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామిక హక్కులను కాపాడేందుకు ప్రతీ ఒక్కరూ కేంద్ర ప్రభుత్వాన్ని వ్యతిరేకించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా ఈ వారం రోజుల పాటు సాగే నిరసన కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బి.యాదవరెడ్డి, మండల కార్యదర్శి రాజయ్య, నాయకులు గోపాల్, నర్సింలు శ్రీనివాస్, కమల్‌రెడ్డి పాల్గొన్నారు.

అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి





నవతెలంగాణ-పటాన్‌చెరు

అంగన్వాడీ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈనెల 11 నుంచి రాష్ట్రవ్యాప్త సమ్మెలోకి వెళ్తున్నట్లు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బి.నాగేశ్వరరావు తెలిపారు. పటాన్‌చెరు ఐసిడిఎస్, సీడీపీవో చంద్రకళకు సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్వాడి టీచర్లు సమ్మె నోటీసును శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. అంగన్వాడీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 11 నుంచి రాష్ట్ర వ్యాప్త సమ్మె చేపడతామని హెచ్చరించారు. అంగన్వాడీ ఉద్యోగుల కు కనీస వేతనం 26 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు.అందరినీ పర్మనెంట్ చేయాలన్నారు. సుప్రీంకోర్టు ప్రకారం అంగన్వాడీ ఉద్యోగులకు గ్రాట్యూ విటీ చెల్లించాలని అన్నారు. పటాన్ చెరు ప్రాజెక్టులో గత 23 సంవత్సరాలుగా పని చేస్తున్నా రన్నారు. రిటైర్ మెంట్ బెనిఫిట్ కింద టీచర్స్ కు 10 లక్షలు, ఆయాలకు రూ.5 లక్షలు చెల్లించాలన్నారు. రిటైర్ మెంట్ వయస్సు 60 ఏండ్లు నిర్ణయించాలన్నారు. అందుకోసం రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలన్నారు.కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు నాగలక్ష్మీ, సుజాత, నీరజ, జ్యోతి, లక్ష్మి పాల్గొన్నారు.

జోగిపేట : గత 40 ఏండ్లకు పైగా ఐసిడిఎస్‌లో పనిచేస్తున్న అంగన్వాడీలను తక్షణమే ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి డి.విద్యాసాగర్ డిమాండ్ చేశారు. అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి ఈనెల 11 నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తున్నామని.. ఈ మేరకు ఐసిడి ఎస్ ప్రాజెక్టు జోగిపేట కార్యాలయంలో అంగన్వాడీలతో కలిసి కార్యాలయ సిబ్బంది దేవి సింగ్‌కు శుక్రవారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ.. అంగన్వాడీలకు కనీస వేతనం, పెన్షన్, ఈఎస్ఐ, పిఎఫ్, ఉద్యోగ భద్రత తదితర చట్టబద్ధ సౌకర్యాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పించడం లేదన్నారు. వారి సమస్యలు పరిష్కరించి గ్రాట్యువిటీ సౌకర్యం, హెల్త్ కార్డులు, బోనస్ రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ నాయకురాలు షేకమ్మ, లలితమ్మ, శివలక్ష్మి పాల్గొన్నారు.

నవతెలంగాణ
సంగారెడ్డి
శనివారం | 02 సెప్టెంబర్ 2023 | www.navatelangana.com

మంత్రిని కలిసిన అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మెన్



నవతెలంగాణ-అమీన్‌పూర్

అమీన్‌పూర్ మున్సిపాల్టీకి అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను మంజూరు చేసిన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావును హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మెన్ తుమ్మల పాండు రంగారెడ్డి శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్ప గుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. అమీన్‌పూర్ మున్సిపాల్టీ ప్రజలకు ఆరోగ్య విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల వసతులు కల్పిస్తూ అభివృద్ధి విషయంలో అమీన్‌పూర్‌ను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని పాండురంగారెడ్డి అన్నారు.

నారాయణఖేడ్‌లో నేడు రక్త దాన శిబిరం



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా నేడు(శనివారం) పవన్ కళ్యాణ్ అభిమానుల ఆధ్వర్యంలో నారాయణఖేడ్ బ్లడ్ డోనర్స్ సహకారంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయనున్నారు. పవన్ కళ్యాణ్ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. నారాయణఖేడ్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఉదయం 10 గంటలకు రక్తదానం శిబిరం ప్రారంభం అవుతుందని.. రక్త దానం చేసే వారు 7989894520, 6305043932, 6281869530 నెంబర్లను సంప్రదించాలన్నారు. పవన్ కళ్యాణ్ అభిమానులు, కృష్ణనవీన్, పవన్, రమేష్, సిద్ధు, నారాయణఖేడ్ బ్లడ్ డోనర్స్ వ్యవస్థాపకులు ముజాహెద్ చిస్తీ,సభ్యులు సామాజిక కార్యకర్త ఓం ప్రకాష్, శివ బిరాధర్ తదితరులు పాల్గొన్నారు.



చిరుత దాడిలో ఆవును కోల్పోయిన బాధితుడికి రూ.25 వేల సాయం

నవతెలంగాణ-జిన్నారం

మండలంలోని మంగంపేట గ్రామానికి చెందిన మహమ్మద్ ఖాదర్ ఆవు చిరుత దాడిలో మృత్యువాత పడిన విషయం విధితమే. ఈ విషయాన్ని గ్రామస్తులు, స్థానిక బీఆర్ఎస్ నేతలు ఎమ్మెల్యే జీఎంఆర్, బీఆర్ఎస్ రాష్ట్ర నేత మధు సూదన్ రెడ్డి, ఎమ్మెల్యే తనయుడు విక్రమ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వెంటనే స్పందించి రూ.25000 ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శుక్రవారం మంగంపేట గ్రామస్తులు ఎమ్మెల్యే జీఎంఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రశాంతి నరేందర్,ఉప సర్పంచ్ నాగరాజ్, మహమ్మద్ ఖదీర్, మాజీ సర్పంచ్ మల్లేష్, గౌరీ వెంకటేష్, కత్తుల రవి, సంతు, రాజు, కిట్టు, తన్వీర్ ,హాజీ షాబుద్దీన్,జిన్నారం మండల టిఆర్ఎస్ పార్టీ మైనారిటీ ప్రెసిడెంట్ మహమ్మద్ ఖదీర్, పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు.



ఖాజిపల్లిలో అక్రమ కట్టడాల కూల్చివేత

నవతెలంగాణ-జిన్నారం

మండల పరిధిలోని పారిశ్రామిక పంచాయతీ ప్రాంతమైన ఖాజిపల్లి గ్రామంలో రెవెన్యూ యంత్రాంగం తహసీల్దార్ రవికుమార్ ఆదేశాలతో రెవిన్యూ ఇన్స్పెక్టర్ జయప్రకాష్ ఆధ్వర్యంలో అక్రమ కట్టడాలను శుక్రవారం కూల్చి వేశారు. ఈ సందర్భంగా ఆర్ఐ జయప్రకాష్ మాట్లాడుతూ.. గ్రామ కంటానికి చెందిన భూముల్లో అక్రమ కట్టడాలను గుర్తించి కూల్చివేసినట్టు తెలిపారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

నవతెలంగాణ-కంగ్టి

మండలంలోని ముర్కుంజాల గ్రామానికి చెందిన ఉత్తంరావు భార్య అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నది. వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా డబ్బులు మంజూరయ్యాయి. అందుకు సంబంధించిన చెక్కును మాజీ డీసీసీ ప్రధానకార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి శుక్రవారం బాధిత కుటుంబానికి అందజేశారు.



కాటా శ్రీనివాస్‌గౌడ్‌కు రాఖీ కట్టిన కౌన్సిలర్లు

నవతెలంగాణ-అమీన్‌పూర్

పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్‌కు అమీన్‌పూర్ మున్సిపాల్టీ 13వ వార్డు కౌన్సిలర్ జి. లావణ్య శశిధర్ రెడ్డి, 16వ వార్డు కౌన్సిలర్ సునీత రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాట శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. రాఖీ పండుగ సందర్భంగా సోదరీమణులకు పేరుపేరునా రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు చెప్పారు. ప్రతి ఒక్కరూ సోదరి భావంతో మెలుగుతూ.. అన్నా చెల్లెల అనుబంధంతో కలిసిమెలిసి ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అమీన్‌పూర్ మున్సిపల్ కౌన్సిలర్ సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు కాట సుధారాణి, అమీన్పూర్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు శశిధర్ రెడ్డితో పాటు పలువురు మహిళలు పాల్గొన్నారు.



మీ ఫోన్ పోయిందా... చింతించకండి

నవతెలంగాణ-ఝరాసంగం

ప్రస్తుత రోజుల్లో మొబైల్ కనిపించకుండా పోతేనే ఎంతో చింతిస్తాం. మొబైల్ పడిపోయిన.. ఎవరైనా దొంగిలించినా.. అందులో ఉన్న సమాచారం హ్యాక్ అయిన ఆందోళన చెందుతాం. ఇలాంటి సమస్యలకు చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్ట్రీ (సిఎస్ఐఆర్) కొత్త సేవలతో మొబైల్ ఫోన్లను ఈజీగా తెలుసుకుని.. తిరిగి అని స్థానిక ఎస్సై రాజేందర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్ లో పిటిషన్ దారులు ఆంధ్రకు చెందిన మాల్యాద్రి, హద్నూర్ గ్రామానికి చెందిన బోయిని రాజు లకు పోగొట్టుకున్న మొబైల్స్ ను ట్రేస్ అవుట్ చేసి అందజేశారు.

ఘనంగా ఉపసర్పంచ్ ఎండి.ఫహీం జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-అమీన్‌పూర్

మండల పరిధిలోని కృష్ణారెడ్డిపేట ఉపసర్పంచ్, దుర్గా నగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు ఎండి ఫహీం జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కృష్ణారెడ్డి గ్రామపంచాయతీ పరిధిలోని పలువురు ముఖ్య నాయకులు, వివిధ కాలనీల వాసులు, గ్రామస్థులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం దుర్గా నగర్ కాలనీ చౌరస్తాలో ఏర్పాటుచేసిన జన్మదిన వేడుకల్లో వివిధ కాలనీల వాసులు, గ్రామస్తులతో కలిసి కేక్ కట్ చేశారు. వివిధ కాలనీలవాసులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఉపసర్పంచ్ ఫహీంతో కేక్ కట్ చేయించి అనంతరం శాలువాలతో గజమాలతో ఘనంగా సన్మానించారు. తదనంతరం ఉప సర్పంచ్ ఎండి ఫహీం మాట్లాడుతూ.. తన జన్మదినాన్ని పురస్కరించుకొని ఇంత పెద్ద ఎత్తున తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపిన ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు చెప్పారు.

ప్రభుత్వ విద్యాసంస్థలకు మహర్దశ

- పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- ముత్తంగిలో మన ఊరు మనబడి పథకం పనుల ప్రారంభోత్సవం



నవతెలంగాణ-పటాన్‌చెరు

తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యాసంస్థలకు మహర్దశ వచ్చిందని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండలం ముత్తంగి గ్రామంలో మన ఊరు మన బడి, మహత్మ గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం, జిల్లా మినరల్ ఫండ్ ద్వారా మంజూరైన రెండు కోట్ల 29 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పునరుద్ధరణ, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నూతన భవనం, వంట గదులు, డైనింగ్ హాల్ ను స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వాల అయోమయంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన ప్రభుత్వ విద్యాసంస్థలు నేడు సీఎం కేసీఆర్ నాయకత్వంలో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దామన్నారు. విద్యా వ్యవస్థలో కీలక మార్పులకు శ్రీకారం చుట్టిన మన ఊరు మన బడి పథకం ద్వారా నియోజకవర్గం వ్యాప్తంగా మొదటి దశలో 55 పాఠశాలల్లో వివిధ పనులు చేపట్టామన్నారు. ప్రధానంగా డ్యూయల్ డేస్కులు, కంప్యూటర్లు, ఆధునిక బ్లాక్ బోర్డులు, రంగులతో కూడిన క్లాస్ రూములు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వీటితోపాటు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయ సిబ్బందిని ప్రభుత్వం భర్తీ చేసిందన్నారు. దీని మూలంగా విద్యాసంస్థల్లో అడ్మిషన్ల సంఖ్య పెరగడంతో పాటు, అద్భుతమైన ఫలితాలు వస్తున్నాయని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ పాటించడం అత్యంత ముఖ్యమని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు వారం లో మూడ్రోజుల పాటు రాగి జావ, మరో మూడు రోజులు గుడ్లు అంది స్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా రెండు కోట్ల రూపా యలతో అతి త్వరలో పాఠశాల భవనాన్ని విస్తరిస్తామన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, ఎంపీపీ సుష్మా శ్రీ వేణుగోపాల్ రెడ్డి, జెడ్పీటీసీ సుప్రజా వెంకట్ రెడ్డి, వైస్ ఎంపీపీ స్వప్న శ్రీనివాస్, మండల విద్యాశాఖ అధికారి పిపి రాథోడ్, సర్పంచ్ ఉపేందర్, ఆత్మ కమిటీ చైర్మెన్ కుమార్ గౌడ్, పంచాయతీరాజ్ డి ఈ సురేష్, ఉప సర్పంచ్ లింగారెడ్డి, సింగిల్ విండో చైర్మెన్ బిక్షపతి, స్థానిక ప్రజాప్రతినిధులు విద్యార్థులు పాల్గొన్నారు.

దరఖాస్తులు స్వీకరించకుండా.. లిస్ట్ ఎలా తయారైంది?



నవతెలంగాణ-జహీరాబాద్

దళితబంధు పథకం కోసం ఆన్‌లైన్‌లో గానీ, కార్యాలయం ద్వారా గానీ ఎలాంటి దరఖాస్తులను తీసుకోకుండానే.. లబ్దిదారుల ఎలా తయారు చేశారని సీపీఐ(ఎం) కార్యదర్శి వర్గ సభ్యులు బి.రామచందర్ డిమాండ్ చేశారు. దీన్ని వ్యతిరేకిస్తూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఆర్డీఓ వెంకటొడ్డికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామచందర్ మాట్లాడుతూ.. జహీరాబాద్ నియోజకవర్గంలో ఇప్పటివరకు ఏ ఒక్క గ్రామంలో కూడా ఆన్‌లైన్ ద్వారా గానీ, కార్యాలయం ద్వారా గానీ దరఖాస్తులను స్వీకరించలేదన్నారు. మరి అలాంటిది దళితబంధు లబ్దిదారులను ఏ విధంగా తయారు చేశారని ప్రశ్నించారు. నిరుద్యోగులు, భూమి లేని పేదలు, వికలాంగులకు దళితబంధులో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. దళిత బంధు పథకాన్ని పారదర్శకంగా కాకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం పార్టీ పథకంగా తయారు చేసిందని ఆరోపించారు. అధికార యంత్రాంగం జోక్యం చేసుకొని దరఖాస్తు తేదీలను ప్రకటించాలని.. ప్రజలందరూ దరఖాస్తు పెట్టుకునే విధంగా అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. నిజమైన లబ్దిదారులకే మొదటి ప్రాధాన్యతలో దళితబంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని యెడల నిజమైన లబ్దిదారులందరినీ సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నరేష్, లక్ష్మణ్, నర్సిములు, తుల్జారం తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజులు అంత కానరాని వారయ్యారా?

- జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్ గ్యారల శ్రీనివాస్, ఉట్ల సుంకరబోయిన మహేష్ ముదిరాజ్
- నీలంకు టికెట్ ఇస్తే.. గెలిపించి కేసీఆర్‌కు బహుమతిగా ఇస్తాం
- ఇంద్రేశంలోని శివాజీ చౌరస్తా వద్ద ధర్నా, రాస్తారోకో



నవతెలంగాణ-పటాన్‌చెరు

రాష్ట్రంలో 60 లక్షల మంది జనాభా కలిగి ఉన్నప్పటికీ.. ముదిరాజులు సీఎం కేసీఆర్‌కు కానరాని వారమయ్యామని పలువురు ముదిరాజ్ బిడ్డలు, జిల్లా మత్స్య శాఖ డైరెక్టర్ గ్యారల శ్రీనివాస్, ఉట్ల సుంకరబోయిన మహేష్ ముదిరాజులు వాపోయారు. మండలంలోని ఇంద్రేశం శివాజీ చౌరస్తా వద్ద ముదిరాజు సంఘాలు, ఎస్ఎంఆర్ యువసేన ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణలో రాష్ట్రంలో 60 లక్షల మంది ఉన్న ముదిరాజులకు ఒక్క ఎమ్మెల్యే టికెట్ కేటాయించకుండా.. కేసీఆర్ మరోసారి ముదిరాజులను మోసం చేశాడని వాపో యారు. ఇప్పటికైనా అధిష్టానం నిర్ణయం మార్చుకోవాలని డిమాండ్ చేశారు. పటాన్ చెరు టికెట్ నీలం మధుకు కేటాయిస్తే గెలిపించుకొచ్చి కేసీఆర్, కేటీఆర్‌లకు బహుమతిగా ఇస్తామన్నారు. రాష్ట్రంలో ముదిరాజులు అందరూ ఒక్కతాటిపైకి వస్తున్నారని దీనివల్ల ఫలితాలు మారుతాయని.. దీని దృష్టిలో పెట్టుకొని పునాలోచించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంద్రేశం ముదిరాజ్ సంఘం నాయకులు బండి పురుషోత్తం,బచ్చుగూడెం మత్స్యశాఖ అధ్యక్షులు విటల్, ఐలాపూర్ ముదిరాజ్ సంఘం నాయకులు గోపాల్, పెద్ద కంజర్ల నాయకులు రమేష్, ఎస్ఎంఆర్ యువసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల 'రియల్' వ్యాపారం



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

నియోజకవర్గంలోని కొందరు ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తూ.. ఉద్యోగంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని అలాంటి వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కొఠారి నర్సింలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్డీఓకు శుక్రవారం వినతి పత్రం కూడా అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఉద్యోగు లు వారి విధులు నిర్వహించకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారం రాజకీయాలు చేస్తున్నారన్నారు. అలాగే ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠాలు బోధించాల్సింది పోయి రియల్ ఎస్టేట్ వ్యాపారం, రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. సమయానికి సారంగా రాకపోవడంతో విద్యార్థులు నష్టపోతు న్నారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు రియల్ ఎస్టేట్ చేయొద్దని నిబంధనలు ఉన్నప్పటికీ.. వాటిని లెక్కచేయకుండా భూదందాలు, భూ వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. 2018 నుంచి 2021 వరకు ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ రుణాలు మంజూరయ్యాయని.. అయితే కొందరు ఉపాధ్యాయులు బినాములను పెట్టుకొని కార్పొరేషన్ లబ్ధిదారుల దగ్గర రుణాలు రాకముందే రూ.20 వేల నుండి 30 వేల వరకు వసూలు చేసిన దాఖలాలు ఉన్నాయని ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి రాజకీయాలు చేయాలని.. కానీ ఇలా ఉద్యోగంలో ఉన్నప్పుడే నిబంధనలను దిక్కరించి రాజకీయం చేయడం సరికాదన్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని.. లేని యెడల వారిపై ప్రతిఘటన ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కె సతీష్, ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రవీణ్, సామాజిక కార్యకర్త తుకారం, ఆవాజ్ నాయకులు ఖలీద్‌లు పాల్గొన్నారు.

కండ్లు మిరిమిట్లు గొలిపేలా 'స్పిట్ యువర్ గేమ్'

నవతెలంగాణ-పటాన్‌చెరు



గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లోని కళాకృతి విద్యార్థులు 'స్పిట్ యువర్ గేమ్' పేరిట శుక్రవారం నిర్వహించిన ఒకరోజు స్ట్రీట్ డ్యాన్స్ మహోత్సవాలు యువతను ఉర్రూతలూగించాయి. కళ్లు మిరిమిట్లు గొలిపేలా సాగిన డ్యాన్స్ పోటీలు విద్యార్థులను ఒకచోట నిలువనీయకుండా ఊగిపోయేలా చేశాయి. హైదరాబాద్‌లో అంతర్లీనంగా ఉన్న వీధి నృత్యాల సంస్కృతిని వెలుగులోకి తీసుకురావడంతో పాటు, భాగ్యనగరంలోనే ఇటువంటి ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని నిర్వహించిన మొదటి కళాశాలగా గీతమును నిలపడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. ఈ కార్యక్రమంలో ఉత్కంఠభరితంగా సాగిన నృత్య పోటీలు, మంత్రముగ్ధులను చేసే అద్భుత ప్రదర్శనలు ఆహూతులందరినీ మూగబోయేలా చేశాయి. అత్యున్నత స్థాయి కళాకారులు పాల్గొన్న ఈ కార్యక్రమం భారతదేశం, దాని వెలుపల ఉన్న నృత్య సంస్కృతిని పునర్నిర్వచించేల చేశాయనడంలో అతిశయోక్తి లేదు. ఆకర్షణీయమైన నృత్యం ప్రదర్శనలు, పోటీల నుంచి, 'స్పిట్ యువర్ గేమ్' పట్టణ నృత్య సంస్కృతిని పునరుత్తేజం చేసిన మరపురాని వేడుకగా నిలిచింది. ఈ డ్యాన్స్ పోటీల్లో సమకాలీన హిప్-హాప్, వీధి నృత్య శైలి సమ్మేళనంతో తీవ్ర పోటీ కొనసాగింది. ఉత్తమ డ్యాన్సర్లు తమ ఆధిపత్యం నిలుపుకోవడానికి పోరాడారు. ఆకర్షణీయమైన ర్యాప్ ప్రదర్శన విద్యార్థులను బీట్‌కు అనుగుణంగా నర్తించేలా చేసింది. డ్యాన్స్ ఫ్లోర్లో డ్యాన్సర్లు తమ అత్యుత్తమ ప్రతిభను చూపినప్పుడు ఉత్సాహం, ఉద్విగ్నతలు చోటుచేసుకున్నాయి. మొత్తంగా ఈ వారాంతం స్వచ్ఛమైన శక్తి,అభిరుచి, విస్మయపరిచే ప్రదర్శనల రోజుగా నిలిచిపోయింది.



ఆదరించండి.. అభివృద్ధి చేసి చూపిస్తా

- వచ్చే ఎన్నికల్లో అధికార పార్టీని తరిమికొట్టండి
- మాజీ మంత్రి బాబు మోహన్



నవతెలంగాణ-పుల్కల్

వచ్చే ఎన్నికల్లో తనను ఆదరించి గెలిపిస్తే.. ఆందోల్ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి చూపిస్తానని మాజీ మంత్రి బాబు మోహన్ అన్నారు. పుల్కల్ మండల పరిధిలోని మిన్పూర్ గ్రామంలో శుక్రవారం జరిగిన 'మేరీ మిట్టి మేరా భారత్' అనే కార్యక్రమానికి ఆయన ప్రత్యేకంగా హాజరై.. గ్రామంలోని పలు వీధులలో తిరుగుతూ మట్టిని సేకరించారు. సేకరించిన మట్టిని తమ పార్టీ కారాలయ నిర్మాణం కోసం ఢిల్లీకి పంపిస్తామన్నారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. 2014 ఎన్నికల్లో ఆందోల్ నియోజకవర్గం నుంచి గెలుపొంది.. నియోజకవర్గంలోని ప్రతీ ఒక్క గ్రామాన్ని అభివృద్ధి చేశానన్నారు. ఇప్పుడున్న పాలకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం ప్రభుత్వ ఆస్తులను అన్యాక్రాంతం చేయంతోపాటు.. కబ్జాలు చేస్తున్నారని ఆరోపించారు. అభివృద్ధి కోసం వచ్చిన నిధులను కూడా వదలకుండా నీచ రాజకీయాలు చేస్తున్నారన్నారు. కావున రాబోయే ఎన్నికల్లో అధికార పార్టీని చిత్తు చిత్తుగా ఓడించి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఎవరెన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా.. రాబోయే ఎన్నికల్లో అటు కేంద్రంలో ఇటు రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందన్నారు. కావున కార్యకర్తలు ఇకనుండి తమ తమ గ్రామాల్లో గట్టిగా పని చేయాలన్నారు. అంతేకాకుండా గ్రామాలలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షులు కుమ్మరి పాండరి, ఉపాధ్యక్షులు రమేష్, బీజేవైఎం కార్తీక్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి జగన్నాథ్, నాయకులు యాదగిరి, శేఖర్, జగన్, పెంట గౌడ్, రమేష్, లింగం, మధు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు పెరిగిన వేతనం అమలు చేయాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు పెరిగిన వేతనం అమలు చేయాలని.. వారిని పర్మినెంట్ చేయాలని, సమన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రమైన ప్రభుత్వ హాస్పిటల్ ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్. అనిల్ కుమార్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.యాదగిరి మాటాడుతూ.. జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంటాక్ట్ కార్మికులకు కనీస వేతలను అమలు చేయడం లేదన్నారు. ప్రభుత్వ ఆసు పత్రులలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, పేషంట్ కేర్, వానిటేషన్, స్వీపర్స్, సెక్యూరిటీ గార్డ్స్ చాలా సమస్యలతో బాధపడుతు న్నారన్నారు. కార్మికులను కాంట్రాక్టర్ చాలా ఇబ్బందులు పెడుతున్నాడని ఆరోపించారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం వేతనాలు చెల్లించకుండా తక్కువగా చెల్లిస్తున్నాద న్నారు. ప్రభుత్వం నిర్ణయం ప్రకారం.. అన్ని హాస్పిటల్స్‌లో రూ.15,600లలో కార్మికుడికి రూ.12,093లు చెల్లించి మిగిలినవి పిఎఫ్, ఈఎస్ఐ ఖాతాలలో జమ చేయాల్సి ఉందని.. కానీ కాంట్రాక్ట్ సంస్థలు అన్నీ కుమ్మక్కై, రాష్ట్రవ్యాప్తంగా రూ.10,500లు, రూ.11,000 మాత్రమే చెల్లిస్తున్నాయన్నారు. లక్షల రూపాయలు కార్మికుల డబ్బు కాజేస్తున్నారన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం చెల్లించే విధంగా హాస్పిటల్స్ అధికారులకు, కాంట్రాక్టర్లకు తగిన ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 50ఏండ్ల వయస్సు దాటిందని తొలగిస్తున్నారన్నారు. ప్రత్యేకంగా రెస్ట్ రూమ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ఐడి కార్డు, యూనిఫాం, బ్లౌజులు, షూస్, ఇతర పరికరాలు సరిపడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్దఎత్తున పోరాట నిర్వహిస్తామని హెచ్చ రించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు యాదగిరి, శ్రీకాంత్, కిరణ్, శోభ, మరియమ్మ రమాదేవి, అలీమా, రత్నయ్య, సునీత, అనిత, నిఖిత, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రి కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

- వేతనాల్లో కోత విధిస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి
- సీఐటీయూ డివిజన్ కార్యదర్శి విద్యాసాగర్



నవతెలంగాణ-జోగిపేట

జోగిపేట ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తున్న పేషంట్ కేర్, శానిటేషన్, స్లీపర్స్, సెక్యూరిటీ గార్డ్స్ లాంటి కాంట్రాక్ట్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి డి. విద్యాసాగర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు హాస్పిటల్ ఎదుట శుక్రవారం ధర్నా చేసి.. డ్యూటీ డాక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం విద్యాసాగర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు రూ.15,600 వేతనం ఇవ్వాలని జీవో జారీ చేసినప్పటికీ.. కాంట్రాక్టర్లు మాత్రం రూ.10,000 వేతనం ఇచ్చి కార్మికుల శ్రమను దోచుకుంటున్నారన్నారు. వెంటనే జీవో ప్రకారం వేతనం చెల్లించాలని.. అలా చెల్లించని కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పీఎఫ్‌లో యజమాని వాటాను కూడా కార్మికుడి వేతనంలో కట్ చేసున్నారని, తక్షణమే కార్మికు లందరినీ పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. లేనియెడల ఉద్యమిస్తామని హెచ్చరించారు.నాయకులు మల్లేశం, శ్రావణ్, హరి, సురేష్, రాజు, శేఖర్, జయమ్మ, సుజాత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అన్ని వార్డుల్లో చురుగ్గా అభివృద్ధి పనులు



నవతెలంగాణ-జోగిపేట

అందోల్ జోగిపేట మున్సిపల్ పరిధిలోని 20 వార్డుల్లో అభివృద్ధి పనులు చురుకుగా సాగుతున్నాయని, ఒక్కొక్క వార్డులో స్థానిక ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ సహకారంతో రూ. 50 లక్షల వ్యయంతో సీసీరోడ్లు, డ్రయినేజీ పనులు కొనసాగు తున్నాయని మున్సిపల్ చైర్మెన్ గూడెం మల్లయ్య అన్నారు. 10వ వార్డులో కొనసాగుతున్న అభివృద్ధి పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాణ్యతతో కూడిన సీసీరోడ్లు, డ్రయినేజీలు పనులు చేపట్టాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఎక్కడైనా ఇబ్బంది ఉంటే సరి చేసుకొని ఎవరికీ ఇబ్బంది కలగకుండా అందరి సహాయ సహకారాలతో పనులను ముందుకు కొనసాగించాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించకపోతే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆందోల్ జోగిపేట్ 10వ వార్డు మాజీ కౌన్సిలర్ తుపాకుల సునీల్ కుమార్, 10,11వ వార్డు పార్టీ అధ్యక్షులు శ్రీహరి, నాయికోటి అశోక్, ఆత్మ కమిటీ డైరెక్టర్ మహేష్ యాదవ్, కాలనీ వాసులు నరేష్, మహేష్, కుమారస్వామి, రవి, మల్లేశం, రమేష్,మురళి, మైబ్, రాజ మల్లయ్య, సులోచన, నర్సమ్మభాగమ్మ, సత్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎన్ఆర్ నూతన బ్రాంచ్ ప్రారంభం

ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ పుష్పనగేష్



నవతెలంగాణ-అమీన్‌పూర్

అమీన్‌పూర్ మున్సిపాల్టీ బీరంగూడలోని ఎస్ఎన్ఆర్ హాస్పిటల్ నూతన బ్రాంచ్ ప్రారంభోత్సవాన్ని 112 డివిజన్ కార్పొరేటర్ పుష్ప నగేష్ యాదవ్ చేతుల మీదుగా శుక్రవారం ప్రారంభించారు. ఎస్ఎన్ఆర్ హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ నవీన్‌రెడ్డి మరియు వారి కుటుంబ సభ్యులు కార్పొరేటర్ పుష్ప నగేష్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో కార్పొరేటర్ పాల్గొని పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలు వారి ఆరోగ్య ఇబ్బందులతో, సమస్యలతో ఆసుపత్రికి రావడం జరుగుతుంది కావున వారికి సరైన వైద్యం అందించ డంలో ఎస్ఎన్ఆర్ ఆసుపత్రి యాజమాన్యం సిబ్బంది ముందు ఉండాలని కోరారు. అనంతరం ఎస్ఎన్ఆర్ హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ నవీన్ రెడ్డి మాట్లాడుతూ.. పేద ప్రజలకు ఉచితంగా ప్రత్యేక క్యాంపులు నిర్వహించి వారికి చికిత్సను అందించడంతోపాటు వారికి కావలసిన వైద్యంను అందిస్తామన్నారు. ఈ పూజ కార్యక్రమంలో ఎస్ఎన్ఆర్ హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ నవీన్‌రెడ్డి, పలువురు డాక్టర్లు, వైద్య సిబ్బంది, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మట్టి సేకరణ ప్రారంభించిన ఢిల్లీ వసంత్



నవతెలంగాణ-జహీరాబాద్

ప్రముఖ సామాజిక ఉద్యమకారుడు, రైతునేత ఢిల్లీ వసంత్ నిర్వహించనున్న 'భూమి పుత్రుల ఆకలి కేక.. మట్టి మనుషుల మనోగతం' అనే ఆత్మీయ సమ్మేళనంలో భాగంగా ఆయన బృంద సభ్యులు నియోజకవర్గంలో పలు గ్రామాల్లో మట్టి సేకరణను మొదలు పెట్టారు. ఈనెల 4న(సోమవారం) ఉదయం 10:30 గంటలకు పట్టణంలోని శెట్కార్ ఫంక్షన్ హాల్‌లో ఆయన నిర్వహించనున్న సభకు జహీరాబాద్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి మట్టి సేకరణలో భాగంగా మొదటి రోజు ఢిల్లీ వసంత్ తన బృందంతో అల్గోల్ గ్రామ శివారులో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయనతో పాటు ఆయన బృంద సభ్యులు రైతు నాయకులు బిల్లిపురం మాధవ్ రెడ్డి, విశాల్ గోడ్కే, అశోక్ పాటిల్, పాపన్న, విష్ణు వర్ధన్, ఓంకార్, చంద్రన్న, స్టీవెన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



నవతెలంగాణ-వెల్దుర్తి

గత 20 సంవత్సరాలుగా సెర్ప్‌సంస్థ విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న క్రమంలో సీఎం కేసీఆర్ గౌరవ వేతనం రూ.8 వేలకు పెంచడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో ఎమ్మెల్యే మదన్ రెడ్డి ఎంపీపీ స్వరూప నరేందర్ రెడ్డి జెడ్పిటిసి రమేష్ గౌడ్ ఏపీఎం శంకరయ్యలతో కలిసి సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు . ఈ సందర్భంగా సెల్ఫ్ ఉద్యోగులు మాట్లాడారు గత 20 సంవత్సరాల నుంచి వెట్టి చాకిరి చేస్తున్న తమకు సీఎం కేసీఆర్ గౌరవ వేతనం రూ. 8 వేలకు పెంచడం పట్ల హర్ష వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీసీలు వివో ఏలు మండల అధ్యక్షులు సల్ల అశోక్, కార్యదర్శి సృజన, కోశాధికారి వడ్ల సంతోష్, మహేష్, ఆసియా బేగం, లక్ష్మి, జ్యోతి, బాలమణి, పుష్ప, కిరణ్మయి, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి రావాలని ఎంపీకి ఆహ్వానం

నవతెలంగాణ-చేగుంట



చేగుంట పట్టణంలో మహంకాళి దేవతా విగ్రహ ప్రతిష్ఠ, మహోత్సవం నిర్వహించనున్నారు. సెప్టెంబర్ 9వ తేది నుంచి 11 తేదీ వరకు నిర్వహించే ఈ కార్యక్రమానికి హాజరు కావాలని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డిని ఆయన నివాసంలో కలిసి సర్పంచ్ అధ్యక్షుల ఫోరమ్ అధ్యక్షుడు మంచికట్ల శ్రీనివాస్ ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌తో పాటు ఆలయ కమిటీ సభ్యులు , పాలకవర్గం సభ్యులు, పట్టణ నాయకులు సంద్రుగు రవి, అన్నం రవి, చాట్ల సంతోష్, రాజేష్, తదితరులు ఉన్నారు.

రేషన్ డీలర్ల బియ్యం అక్రమ దందా

- వినియోగదారుల నుంచి నేరుగా కొనుగోళ్లు
- దళారులతో యథేచ్ఛగా వ్యాపారం
- "మామూలు"గా వ్యవహరిస్తున్న అధికారులు

నవతెలంగాణ-మెదక్

కంచే చేను మేసింది అన్న చందంగా తయారైంది రేషన్ డీలర్ల వ్యవస్థ. పేదలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా అందజేస్తున్న బియ్యం పక్కదారి పడుతుంది. ప్రతీ నెల రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేస్తున్న బియ్యం కోటలో కేవలం 30 శాతం మాత్రమే పేదలు ఇళ్లకు తీసుకెళ్లి తింటుండగా, మిగితా 70 శాతం రేషన్ డీలర్లకు, దళారులకు అమ్మేస్తున్నారు. బియ్యం అక్రమ దందా రేషన్ షాపుల నుంచే ఆజ్యం పోసుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మూడు పువ్వులు ఆరు కాయలుగా రేషన్ డీలర్ల బియ్యం అక్రమ దందా యథేచ్ఛగా జరుగుతున్నా సంబంధిత రెవెన్యూ, పౌర సరఫరా శాఖ అధికారులు మాత్రం ఎలాంటి తనిఖీలు చేయకుండా "మామూలు"గా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో 21 మండలాలు, 469 గ్రామ పంచాయతీలు ఉండగా మొత్తం 520 రేషన్ షాపులు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 2,14,090 రేషన్ కార్డులు ఉండగా 68,8237 మంది లబ్ధిదారులకు 3645900 క్వింటాళ్ల బియ్యాన్ని ప్రతీ నెల ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందజేస్తున్నారు. ఇందులో ఏఎఫ్ఏసి 13,884 కార్డులు ఉండగా వీటిలో 38218 మంది ఉన్నారు. కార్డులోని ఒక్కో సభ్యుడికి నెలకు 4,33,471 క్వింటాళ్ల బియ్యం ఇస్తున్నారు. అలాగే 200138 ఎఫ్ఎస్ సి కార్డులు ఉండగా 649947 మంది సభ్యులు ఉండగా, 32,11,959 క్వింటాళ్లు అందజేస్తున్నారు. అలాగే 68 అన్నపూర్ణ కార్డుల పై 72 మందికి 470 క్వింటాళ్ల బియ్యం పంపిణీ చేస్తున్నారు.

ఆగని అక్రమ దందా

పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న బియ్యం రేషన్ షాపుల నుంచే పక్కదారి పడుతున్నాయి. బియ్యం పక్కదారి పట్టకుండా ఉండేందుకు ప్రభుత్వం బయోమెట్రిక్ యంత్రాలు తీసుకువచ్చినా అక్రమ దందా మాత్రం ఆగడం లేదు. రేషన్ షాపుల ద్వారా దొడ్డు బియ్యం సరఫరా చేస్తుండగా, ఒక్కోసారి సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. దొడ్డు బియ్యాన్ని కేవలం 30శాతం మంది మాత్రమే తింటుండగా, మిగతా 70 శాతం మంది కార్డుదారులు ఆ బియ్యాన్ని తినడానికి ఇష్టపడటం లేదు. వేలిముద్రలు వేసి బియ్యం తీసుకోవాల్సిన వినియోగదారులు తిరిగి రేషన్ డీలర్లకు, దళారుల విక్రయిస్తున్నారు. ప్రతీ నెలా రేషన్ డీలర్లు లబ్ధిదారుల నుంచి కిలోకు రూ.10 నుండి రూ.12 ల చొప్పున చెల్లించి కొనుగోలు చేస్తు దళారులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. అలా కొనుగోలు చేసిన బియ్యాన్ని ఆటోలు, కార్లలో నల్ల బజారుకు తరలిస్తున్నారు. ప్రతినెలా 1 నుంచి 15వ తేదీ వరకు రేషన్ షాపుల్లో బియ్యం ఇవ్వాల్సి ఉండగా, కొందరు డీలర్లు తమ ఇష్టారీతిన వ్యవహరిస్తున్నట్లు పలువురు కార్డుదారులు వాపోతున్నారు.



ఏదీ నిఘా

బియ్యం అక్రమ రవాణాపై అధికారుల నిఘా కరువైందనే చెప్పాలి. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లోని రేషన్ షాపుల నుంచి ప్రతీ నెల 5 నుంచి 20వ తేదీ వరకు పెద్ద ఎత్తున బియ్యం అక్రమ దందా జరుగుతున్నప్పటికీ సంబంధిత రెవెన్యూ, సివిల్ సప్లై అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. రేషన్ షాపులపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో డీలర్ల దందా దర్జాగా కొనసాగుతుంది. ప్రతినెల బియ్యం పంపిణీ చేసే సమయంలో అధికారులు రేషన్ షాపులను తనిఖీలు చేపడితే డీలర్ల అవినీతి బాగోతం బయటపడుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రతి నెల రేషన్ షాపులకు వచ్చిన కోటా ఎంత, వినియోగదారులకు పంపిణీ చేసింది ఎంత, మిగిలిన స్టాక్ ఎంత అనే లెక్కల పై ఆరా తీస్తే డీలర్ల గుట్టు రట్టయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమ దందాకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.



తనిఖీలు చేపడతాం



రేషన్ షాపుల తనిఖీలు చేపడతాం. నేను జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారిగా ఇటీవల బాధ్యతలు చేపట్టడం జరిగింది. బియ్యం అక్రమ దందా కొనసాగితే చర్యలు తీసుకుంటాము.

– బ్రహ్మ రావు, డీసిఎస్ఓ, మెదక్

మత్స్యకారుల అభివృద్ధియే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే మదన్ రెడ్డి

నవతెలంగాణ-వెల్దుర్తి



మత్స్యకారుల అభివృద్ధి కోసం ప్రభుత్వం 100% సబ్సిడీతో చేప పిల్లలను అందజేయడం జరిగిందని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మత్స్యశాఖ అధికారి ఏడి రజిని ఎంపీపీ స్వరూప నరేందర్ రెడ్డి, జెడ్పిటిసి రమేష్ గౌడ్ స్థానిక సర్పంచ్ ఆముద భాగ్యలక్ష్మి ఆంజనేయులు మత్స్యకారులతో కలిసి కుడి చెరువులో మూడు లక్షల 70 వేలు, దేవతల చెరువులో మూడు లక్షల ఇరవై వేలు, ఆరెగూడెం గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న రామ్ రెడ్డి చెరువులో ఒక లక్ష పదిహేను వేలు చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు భారత రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో సబ్బండ వర్గాల ప్రజలను ఆదుకోవడం జరిగిందన్నారు చెరువులన్నీ నిండుకుండను తలపిస్తున్నాయన్నారు. చెరువులలో వదినల చేప పిల్లలు ఎదిగిన అనంతరం అమ్ముకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని మత్స్యకారులకు సూచించారు. జిల్లా మత్స్యశాఖ అధికారి ఏడి రజిని మాట్లాడారు. నర్సాపూర్ నియోజకవర్గంలో 19 లక్షల 56 వేల, చిన్న సీడు సీజన్ ట్యాంక్ 17 లక్షల 41 వేల, పెద్ద చేపలు పెరియల్ వంటి చేప పిల్లలను వదలడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బారాస మండల అధ్యక్షుడు భూపాల్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రతాపరెడ్డి, ఎంపిటిసి మోహన్ రెడ్డి, వైస్ ఎంపీపీ సుధాకర్ గౌడ్, మత్స్యకారుల సంఘం మండల అధ్యక్షుడు బాలరాజ్, కోశాధికారి శ్రీనివాస్ అశోక్ సురేష్, మల్లేష్ పవన్ రాజ్, ఆంజనేయులు, ఆయా గ్రాముల ఎంపీటీసీలు సర్పంచులు ప్రజాప్రతినిధులు అధికారులు అనధికారులు పాల్గొన్నారు.

నర్సాపూర్ టికెట్ ఎమ్మెల్యే మదన్ రెడ్డికే ఇవ్వాలి

- ముస్లిం సోదరుల ప్రత్యేక ప్రార్థనలు

నవతెలంగాణ-నర్సాపూర్



నర్సాపూర్ టికెట్ ఎమ్మెల్యే మదన్ రెడ్డికే ఇవ్వాలంటూ శుక్రవారం నర్సాపూర్ పట్టణంలోని పీర్ల గుట్టపై ఉన్న హజ్రత్ షాంబుల్ సాహెబ్ బాబా దర్గాలో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు మాట్లాడుతూ 9 సంవత్సరాల పాలనలో నర్సాపూర్ నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే మదన్ రెడ్డి అన్ని రంగాలలో అభివృద్ధి చేశారని వారు గుర్తు చేశారు. నర్సాపూర్ నియోజకవర్గ అభివృద్ధి చెందిందంటే అది కేవలం ఎమ్మెల్యే మదన్ రెడ్డితోనె సాధ్యమన్నారు. ఎమ్మెల్యే మదన్ రెడ్డికే వచ్చే ఎన్నికల్లో టికెట్ వచ్చేలా చూడాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు హబీబ్ ఖాన్ , మైనార్టీ పట్టణ అధ్యక్షుడు రావూఫ్, మైనార్టీ సోదరులు ఇక్బాల్ జాఫర్,హైదర్ బేగ్, ఇబ్రహీం, లాయక్, దావూద్, అజ్జు, సోహెల్, అజ్జిజ్, హసీఫ్, తదితరులు పాల్గొన్నారు.

మద్యపాన నిషేధంపై గ్రామపంచాయతీ ఏకగ్రీవ తీర్మానం



నవతెలంగాణ- నిజాంపేట

మండల పరిధిలోని నగరం తండా గ్రామంలో శుక్రవారం గ్రామ సర్పంచ్ గేమ్ సింగ్, ఉప సర్పంచ్, ఎంపిటిసిల ఆధ్వర్యంలో గ్రామంలో మద్యం అమ్మ రాదని ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గేమ్ సింగ్ మాట్లాడుతూ గ్రామంలో సంపూర్ణ మద్యపానం విధించామన్నారు. గ్రామంలో ఎవరైనా మద్యం అమ్మితే 10వేల రూపాయల జరిమానా విధిస్తామన్నారు. గ్రామంలో మద్యపానం నిషేధానికి ప్రతి ఒక్కరు సహకరించాలని గ్రామాభివృద్ధికి పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఎంపీటీసీ లలిత రవి, గ్రామపంచాయతీ పాలవర్గ సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్, గ్రామ కార్యదర్శికి రాఖీ కట్టిన తాండా వాసులు



నవతెలంగాణ-నార్సింగి

మండల పరిధిలోని జేప్ల తాండా వాసులు శుక్రవారం పెద్ద తాండా సర్పంచ్ చత్రియా నాయక్, పంచాయితీ కార్యదర్శి బాలులకు రాఖీలు కట్టి, శాలువాలతో సన్మానించారు. సర్పంచ్ చత్రియా నాయక్ వారికి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జెమ్లా తాండా ప్రజలు చత్రియా నాయక్ చేసిన పలు అభివృధి కార్యక్రమాలకు కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల బీటీ రోడ్డు నిర్మాణం కొరకు రూ 90 లక్షలు మంజూరు చేయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. చందర్ నాయక్, రవి నాయక్, రవీందర్ నాయక్, బాల్యా నాయక్, రాములు నాయక్, వసురామ్ నాయక్, భాస్కర్, బీ.ఆర్.ఎస్ సీనియర్ నాయకులు శ్రీకాంత్, బాబు, స్వామి, మహిందర్, తాండా వాసులు పాల్గొన్నారు.

అందుగులపల్లిలో హనుమాన్ విగ్రహానికి రూ.70 వేల విరాళం

- మెదక్ పార్లమెంట్ ఇన్చార్జి గాలి అనిల్ కుమార్



నవతెలంగాణ-వెల్దుర్తి

కాంగ్రెస్ ప్రభుత్వం సబ్బండ వర్గాల మతాలకు సంబంధించిన దేవాలయాల అభివృద్ధికి అండగా ఉంటుందని మెదక్ పార్లమెంటు ఇంచార్జి గాలి అనిల్ కుమార్ అన్నారు. మండల పరిధిలోని అందుగులపల్లి గ్రామంలో నూతనంగా హనుమాన్ విగ్రహ ప్రతిష్ట నిర్మాణం దేవాలయ అభివృద్ధికి ఆర్థిక సహాయం ఆర్జిస్తున్న క్రమంలో శుక్రవారం కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మహేష్ రెడ్డి అందుగులపల్లి సర్పంచ్ మల్లేశం గౌడ్, రమేష్ గౌడ్, వెంకటేష్, శ్రీనివాస్, కాళిదాస్ కుమారులతో కలిసి మెదక్ పార్లమెంట్ ఇన్చార్జి గాలి అనిల్ కుమార్ ఇంటికి వెళ్లి ఆలయ అభివృద్ధికి ఆర్థిక సాయం అడిగిన వెంటనే రూ 70 వేలు విరాళంగా అందజేయడం జరిగిందని మహేష్ రెడ్డి తెలిపారు. నర్సాపూర్ నియోజకవర్గంలో ఎవరి ఆపదకు వచ్చిన నా వంతు సహాయ సహకారాలు అందజేస్తానన్నారు.

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

- సామాన్యులపై భారం మోపుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- 2, 5వ తేదీల్లో జిల్లాలో నిరసన కార్యక్రమాలు
- కరపత్రం విడుదల చేసిన సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ. మల్లేశం

నవతెలంగాణ-మెదక్

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు రెండు రోజుల పాటు తలపెట్టిన నిరసన కార్యక్రమంలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ. మల్లేశం పిలుపునిచ్చారు. శుక్రవారం మెదక్ కేవలం కిషన్ భవనంలో సీపీఐ(ఎం) పార్టీ కరపత్రం విడుదల చేసింది. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కార్యదర్శి ఏ. మల్లేశం మాట్లాడుతూ దేశంలో నిత్యావసర సరుకుల ధరలు రోజు రోజుకు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. సామాన్య పేద ప్రజలు ఏమి కొని తినలేని పరిస్థితిలో అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వలన సామాన్య మధ్యతరగతి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, నిత్యవసర సరుకుల ధరలను తక్షణమే తగ్గించాలని, మార్కెటింగ్ వ్యవస్థను పటిష్ట పరిచే బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టాలని డిమాండ్ చేశారు. కేంద్రంతో పోరాడి 25 వ సంవత్సరంలో ఉపాధి హామీ చట్టాన్ని తీసుకువస్తే, ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం కనీస జీవనాధారంగా ఉన్న ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసిందన్నారు. ఉపాధి హామీ పథకాన్ని పట్టణ ప్రాంతాలకు అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం నిరాకరిస్తుందన్నారు. లక్షలాది ఉద్యోగాలు ఖాళీలుగా ఉన్నా వాటిని కేంద్ర ప్రభుత్వం భర్తీ చేయకుండా, ఉపాధి అవకాశాలను దెబ్బతీస్తూ కార్పోరేట్లకు లాభాలను కట్టబెడుతున్నారన్నారని మండిపడ్డారు. రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణకు ఇచ్చిన వాగ్దానాలను ఇప్పటివరకు అమలు చేయలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. ఈ నెల రెండవ తేదీన గ్రామీణ స్థాయిలో, ఐదవ తేదీన మండల స్థాయిలో జరిగే నిరసన కార్యక్రమాల్లో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు కే. నరసింహ, బి. బసరాజ్, కే. నాగరాజు, నర్సమ్మ పాల్గొన్నారు.



గిరిజనులపై ఫారెస్ట్ అధికారుల దౌర్జన్యం తగదు

- లంబాడ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు గోపాల్ నాయక్

నవతెలంగాణ-కొల్చారం

గిరిజనులపై ఫారెస్ట్ అధికారుల దౌర్జన్యం తగదని లంబాడ హక్కుల పోరాట సమితి మెదక్ జిల్లా అధ్యక్షులు గోపాల్ నాయక్ అన్నారు. ఇటీవల మండలంలోని వసురాంతండాకు చెందిన రమావత్ లాల్యా నివాస పూరిగుడిసె ఫారెస్ట్ అధికారులు తగులబెట్టిన విషయం తెలిసిందే. అయితే శుక్రవారం లంబాడ హక్కుల పోరాట సమితి మెదక్ జిల్లా అధ్యక్షులు గోపాల్ నాయక్ స్పందించి వసురాంతండాను సందర్శించి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత కొంతకాలంగా ఫారెస్ట్ భూమిలో నివాస పూరిగుడిసె వేసుకుని జీవనం కొనసాగిస్తున్న గుంట భూమిలేని నిరుపేద గిరిజన రైతుపై ఫారెస్ట్ అధికారులు ముందస్తు ఎలాంటి నోటీసులు జారీ చేయకుండా దౌర్జన్యంగా దగులబెట్టడం ఏంటని ప్రశ్నించారు. రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబం కూలీ నాలి చేసుకుని సంపాదించుకున్న డబ్బులు, బంగారం, వెండి, నిత్యావసర వస్తువులు ఫారెస్ట్ అధికారులు చేసిన దాష్టికానికి మంటల్లో దగ్దమయ్యాయని ఆవేదన వ్యక్తంచేశారు. దీంతో గిరిజన కుటుంభం రోడ్డున పడిందన్నారు. ఇంతటి దౌర్జన్యానికి పాల్పడిన ఫారెస్ట్ అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే నష్టపోయిన కుటుంబానికి మూడెకరాల భూమితోపాటు ఇంటి నిర్మాణం, నిత్యావసర వస్తువులు అందించాలన్నారు. లేని యెడల లంబాడ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో డిఎఫ్ వో కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రంజిత్ నాయక్, బాబా నాయక్, ప్రేమ్ సింగ్ ఉన్నారు.



ఎమ్మెల్యే కృషితోనే గాజిరెడ్డి పల్లి గ్రామాభివృద్ధి

- సర్పంచ్ భాగ్యలక్ష్మి శ్రీనివాస్

నవతెలంగాణ-హవేలి ఘనాపూర్

గాజిరెడ్డిపల్లి గ్రామాన్ని అభివృద్ధి చేసిన ఘనత మెదక్ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డికి దక్కుతుందని సర్పంచ్ భాగ్యలక్ష్మి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గాజిరెడ్డిపల్లి తండా బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.1.25 కోట్ల నిధులు మంజూరు చేసిన మెదక్ ఎమ్మెల్యే యం. పద్మాదేవేందర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ భాగ్యలక్ష్మి శ్రీనివాస్ మాట్లాడుతూ మెదక్ నియోజకవర్గంలో గాజిరెడ్డిపల్లి గ్రామపంచాయతీలోని గాజిరెడ్డిపల్లి తండా నుంచి నాగిరెడ్డి చెరువు కట్ట వరకు బీటీ రోడ్ల నిర్మాణానికి కోట్ల రూపాయలు మంజూరు చేయించిన మెదక్ అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే యం. పద్మాదేవేందర్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రవి నాయక్, కోపరేటివ్ సొసైటీ డైరెక్టర్ సిద్ధిరామిరెడ్డి, తాండ నాయకులు, వార్డ్ సభ్యులు, పాల్గొన్నారు.



నల్ల బ్యాడ్జీలతో ఉద్యోగ, ఉపాధ్యాయుల నిరసన



నవతెలంగాణ- నిజాంపేట

మండల కేంద్రంలో శుక్రవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎదుట పెన్షన్ విద్రోహ దినానికి వ్యతిరేకంగా సిపిఎస్ రద్దు చేసి ఓపిసిని అమలు చేయాలని మండల ప్రజా పరిషత్ కార్యాలయ సిబ్బంది నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సిపిఎస్ రద్దుచేసి ఓపిఎస్ అమలు చేయాలని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పాత పెన్షన్ పద్ధతిని కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జూనియర్ అసిస్టెంట్ వినయ్, కార్యదర్శులు నర్సింలు, వెంకట నరసింహారెడ్డి, ప్రేమ, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-చేగుంట

మండల కేంద్రంలో సీపీఎస్ విధానం రద్దు చేయాలని నల్ల బ్యాడ్జీలతో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నావత్ సురేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ విధానం అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎస్ విధానం రాష్ట్ర ప్రభుత్వం పరిధిలోని అంశమని, రద్దు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వందేనని, ఇప్పటికే కొన్ని రాష్ట్రాలు పంజాబ్, హిమాచల ప్రదేశ్, రాజస్థాన్, ఝార్ఖండ్ సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్ విధానం అమలు చేస్తున్నాయని, ఆ రాష్ట్రాలను ఆదర్శంగా తీసుకుని రాష్ట్రంలో కూడా ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్, చేగుంట మండల అధ్యక్షుడు వెంకటేష్, తపస్ జిల్లా బాధ్యుడు యాదగిరి, వై మాధవి, ప్రభాకర్, శ్రీనివాస్ రెడ్డి, మన్నే గోపాల్, రెవెన్యూ సిబ్బంది హరీష్, భూమేష్, రవీందర్ రెడ్డి, నర్సింగ్ యాదవ్, శ్రీనివాస్, ఉపాధ్యాయులు సుమతి, అమరేశ్వరీ, సంతోష్, రాజేశ్వర్ పాల్గొన్నారు.



చేపట్టిన అభివృద్ధి పనులను చూసి ఎమ్మెల్యే టికెట్ దక్కడం ఖాయం

- ఎమ్మెల్యే మదన్ రెడ్డి

నవతెలంగాణ-వెల్దుర్తి



చేపట్టిన అభివృద్ధి పనులను చూసి అధిష్టానం మరలా నాకే ఎమ్మెల్యే టికెట్ ఇవ్వడం ఖాయమని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆయా చెరువుల్లో చేప పిల్లలను వదలడానికి వచ్చిన సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. రెండు పర్యాయాలు ప్రజల మద్దతుతో గెలుపొంది నర్సాపూర్ నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు . మూడోసారి గెలవడానికి అందరు ఆశీస్సులు తనపై ఉన్నాయన్నారు. అధిష్టానం గమనించి మూడోసారి హ్యాట్రిక్ సాధించడానికి టిక్కెట్ ఇవ్వడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అనునిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజల కష్టాల్లో పాలు పంచుకొని సేవ చేయడం జరిగిందన్నారు. 2014 2018 అసెంబ్లీ ఎన్నికల్లో సునీత లక్ష్మారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయగా బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన తనను భారీ మెజార్టీతో ప్రజలు బ్రహ్మరథనం పట్టి గెలిపించుకున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలే ముందుకు నడిపించి ఎన్నుకొని అభివృద్ధి వైపు నడిపించుకునే సత్తా ప్రజల వద్దనే ఉందన్నారు. ఆ భగవంతుడు ఆయురారోగ్యాలు ప్రసాదిస్తే మరో ఐదేళ్లపాటు ప్రజలకు సేవ చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ శ్రేణులు ఉన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-నిజాంపేట



మండల పరిధిలోని నార్లాపూర్ గ్రామంలోనీ నీలం చెంద్రయ్య అనారోగ్యంతో మృతి చెందారు. చరవాణి ద్వారా విషయం తెలుసుకున్న మైనంపల్లి సోషల్ సర్వీస్ చైర్మన్ మైనాంపల్లి రోహిత్ రావు తక్షణ సహాయం కింద రూ. 5000లను మృతుని కుటుంబానికి అందజేశారు. అంతే కాకుండా వారి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇవ్వడం జరిగింది. ఎం ఎస్ ఎస్ ఓ సభ్యులు బోయిని నాగరాజు గాలం లక్ష్మణ్, స్వామి, ప్రవీణ్. నర్సింలు. కుమార్. రావి. వెంకటేష్, బాబుతోపాటు ముదిరాజ్ సంఘం పెద్దలు బోయిని మహేష్ కాషామైన శ్రీశైలం నీలం యాదగిరి లింగం అంజయ్య పాల్గొన్నారు

నోటరీ ప్లాట్స్ క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-నర్సాపూర్: నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలో నోటరీ ద్వారా కొనుగోలు చేసిన వ్యవసాయ భూములు ప్లాట్లను క్రమబద్ధీకరణ చేసుకునేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మంచి అవకాశం కల్పించిందని మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్ మాట్లాడుతూ 125 చదరపు గజాల లోపు ఉన్న ప్లాట్లకు ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. 125 చదరపు గజముల నుంచి 3000 చదరపు గజముల వరకు మార్కెట్ విలువ ప్రకారం స్టాంప్ డ్యూటీ చెల్లించి అట్టి ఆస్తులను క్రమబద్ధీకరించుకోవచ్చన్నారు. ఈ ప్రక్రియ కొరకు మీసేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఇట్టి దరఖాస్తుల కోసం మూడు నెలలు గడువు ఉందని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

నవతెలంగాణ-నిజాంపేట



మండల కేంద్రానికి చెందిన గుడ్ల అశోక్(23)కు గత 15 రోజుల క్రితం వివాహం కాగా రాఖీ పండుగ సందర్భంగా రామాయంపేట మండల పరిధిలోని కోమటిపల్లి గ్రామానికి అతని అత్తగారింటికి వెళ్లడం జరిగింది.ఈ క్రమంలో పెట్రోల్ పోయించుకొని వస్తా అని ఇంట్లో చెప్పిన వ్యక్తి రామాయంపేట ఎన్ హెచ్ 44 వద్ద ఛత్తీస్ ఘడ్ రాష్ట్రానికి చెందిన టూరిస్ట్ బస్సు ఢీకొనడంతో ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందాడు. గతంలో మృతునికి తల్లిదండ్రులు అన్నయ్య కూడా చనిపోవడం జరిగింది. గ్రామంలో అన్నా అక్క చెల్లి అంటూ అందరితో కలిసిమెలిసి ఉండే అశోక్ మరణంతో నిజాంపేట మండల కేంద్రంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

నేటి బందుకు ఎస్ఎఫ్ఐ సంపూర్ణ మద్దతు



- ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షులు రంజిత్ రెడ్డి

నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల ను రెవిన్యూ డివిజన్ గా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ జేఏసీ ఆధ్వర్యంలో నేడు నిర్వహించ తలపెట్టిన విద్యా సంస్థల బంద్‌కు తమ సంఘం సంపూర్ణ మద్దతు తెలుపుతుందని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) చేర్యాల డివిజన్ అధ్యక్షులు ఆముదాల రంజిత్ రెడ్డి అన్నారు.చేర్యాల మండల కేంద్రంలో శుక్రవారం సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం నాగపురి కిరణ్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో రంజిత్ రెడ్డి మాట్లాడుతూ చేర్యాల,కొమురవెల్లి,మద్దూరు, దూలిమిట్ట మండలాలలో ఉన్న అన్ని ప్రైవేట్,ప్రభుత్వ పాఠశాలలు,కళాశాలల విద్యార్థులు బందులో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అన్ని అర్హతలు ఉన్న చేర్యాలను రెవిన్యూ డివిజన్ గా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించకపోవడం సిగ్గుచేటు అని అన్నారు. తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాలలో చేర్యాల గడ్డపైన తిరుగుబాటు చేసి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం అనేక మంది అమరులయ్యారని, చేర్యాలను రెవెన్యూ డివిజన్ గా ప్రకటించకపోతే రాష్ట్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని అన్నారు. సమావేశంలో డివిజన్ నాయకులు అనిల్, బాలాజీ పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌ను లక్ష మెజార్టీతో గెలిపిస్తాం

నవతెలంగాణ-గజ్వేల్



గజ్వేల్ శాసనసభ నుంచి మూడోసారి ఎన్నికల బరిలో ఉంటున్న సీఎం కేసీఆర్‌ను లక్ష మెజారిటీతో గెలిపిస్తామని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ 1వ వార్డు కౌన్సిల్ సభ్యులు బొగ్గుల చందు తెలిపారు. సీఎం కేసీఆర్ గజ్వేల్ ఎమ్మెల్యేగా ఉండటంవల్లే మున్సిపల్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. మున్సిపల్ చైర్మన్ రాజమౌళి ఆధ్వర్యంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో భారీ మెజార్టీ తీసుకొస్తామన్నారు.

కేసీఆర్, హరీశ్ రావు ఫ్లెక్సీలకు పాలాభిషేకం



నవతెలంగాణ-నంగునూరు

మంత్రి హరీశ్ రావు మన సిద్దిపేట నియోజక వర్గానికి ఎమ్మెల్యే కావడం మన పూర్వ జన్మశుకృతమని మాజీ ఎంపీపీ జప శ్రీకాంత్ రెడ్డి, ఆయిల్ ఫామ్ రైతు వెల్ఫేర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎడ్ల సోమిరెడ్డిలు అన్నారు. వివోఎల జీతాల పెంచడంతో వారి ఆధ్వర్యంలో శుక్రవారం నంగునూరు మండల కేంద్రంలో సీఎం కేసీఆర్, మంత్రి హరీష్‌రావు ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రింది స్థాయిలో పని చేసే ఉద్యోగులను గుర్తించిన ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమన్నారు. ఈ కార్యక్రమంలో నంగునూరు సోసైటి చైర్మన్ కోల రమేష్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అనగోని లింగం గౌడ్, నాయకులు చౌడుచెర్ల జయపాల్ రెడ్డి, ఏపీఎం ఆంజనేయులు, సీసీలు లింగం, శ్రీనివాస్, మల్లేశం, సాయిలు, సిబ్బంది బాలరాజ్, అధ్యక్షుడు శ్రీశైలం, వివోఏలు కిష్టారెడ్డి, విజయ్, అయోధ్య, భాగ్యలక్ష్మి, స్వరూప, సుజాత తదితరులు పాల్గొన్నారు.

మహిళా లోకం కేసీఆర్ వైపే

- మాజీ సర్పంచ్ ఉప్పల పద్మ మెట్టయ్య

నవతెలంగాణ-గజ్వేల్



గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్‌తో పాటు నియోజకవర్గంలో ఉన్న మహిళా లోకం కేసీఆర్ వైపే ఉన్నారని గజ్వేల్ మాజీ సర్పంచ్ ఉప్పల పద్మా మెట్టయ్య అన్నారు. గజ్వేల్ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని ఆమె గుర్తు చేశారు. గతంలో రవాణా మంత్రిగా పనిచేసిన ముఖ్యమంత్రి కేసీఆర్ గతంలోనే గజ్వేల్ అభివృద్ధిపై దృష్టి పెట్టినట్లు ఆమె గుర్తు చేశారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలన్నీ మహిళల పేరిట అమలు చేయడం గొప్ప వరం అన్నారు. మహిళా రిజర్వేషన్లు అమలు చేస్తున్నారన్నారు. గజ్వేల్ పట్టణానికి కోట్లాది రూపాయల నిధులు కేటాయించి పనులు చేపడుతున్నారు. సీఎం కేసీఆర్‌ను లక్ష మెజార్టీతో గెలిపిస్తామన్నారు.

విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి

నవతెలంగాణ-మర్కుక్



విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని మర్కుక్ సర్పంచ్ అచ్చం గారి భాస్కర్ , మండల విద్యాధికారి ఉదయభాస్కర్ రెడ్డిలు అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన మర్కుక్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మర్కుక్ మండల స్థాయి కోకో, కబడ్డీ అండర్ 17, అండర్14 మండల సెలక్షన్ క్రీడాపోటీలను ఆత్మ కమిటీ డైరెక్టర్ యావగారి సంతోష్ రెడ్డి ,ఉపాధ్యాయులతో కలసి వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలలో గెలుపు ఓటములు సహజమని, శారీరిక దారుఢ్యానికి, మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు. విద్యార్థులు క్రీడలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించు కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు పద్మా రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, రమణారావు ,పాఠశాల పిఈటి రజని, పాములపర్తి పిఈటి భవిత, కస్తూర్బా పిఈటి సిహెచ్ సరిత , కస్తూర్బాపాఠశాల విద్యార్థులు,శివారు వెంకటాపూర్ పాఠశాల విద్యార్థులు, తదితరులున్నారు

జిపిఎఫ్ విధానాన్ని పునరుద్ధరించాలి

- పిఆర్టియు మండల అధ్యక్షుడు రామచంద్రా రెడ్డి

నవతెలంగాణ-తొగుట



సిపిఎస్ విధానాన్ని రద్దు చేస్తూ జిపిఎఫ్ విధానా న్ని పునరుద్ధరించాలని పిఆర్టియు మండల శాఖ అధ్యక్షులు పి రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం పెద్ద మసాన్ పల్లి మధిర గ్రామం వడ్డెర కాలనీ ప్రాథమిక పాఠశాల నల్ల బ్యాడ్జితో నిరసన వ్యక్తం చేశారు. పిఆర్టియు రాష్ట్ర,జిల్లా శాఖ ఆదే శానుసారం పెన్షన్ విద్రోహదినం సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఎస్ విధానాన్ని రద్దు చేస్తూ జిపిఎఫ్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అనుసరిస్తున్న కాంట్రి బ్యూషన్ పెన్షన్ విధానం వల్ల ఉద్యోగ ఉపాధ్యాయులకు తీవ్ర నష్టాలు కలిగిస్తుందన్నారు. ఈ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ పునరు ద్ధరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని పాఠశాలల్లోని ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పిఆర్టియు మండల శాఖ ప్రధాన కార్యదర్శి కనకా రెడ్డి, రాష్ట్ర బాధ్యులు హనుమారెడ్డి, మల్లారెడ్డి, రమేష్, సిద్దే శ్వర్, గౌరీ శంకర్ రెడ్డి,సుఖేందర్ రెడ్డి, రేణుక, లలిత, సురేందర్ రెడ్డి, హనుమంతు పాల్గొన్నారు.

సామాజిక పరివర్తన పాదయాత్రను విజయవంతం చేయాలి



- డిబీఫ్ జాతీయ కార్యదర్శి శంకర్

నవతెలంగాణ - దౌల్తాబాద్

డీబీఎఫ్, బామ్ సేఫ్,దళిత బహుజన, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీ నుంచి 20 వ తేదీ వరకు సామాజిక పరివర్తన పాదయాత్రను దుబ్బాక నియోజకవర్గంలో చేపట్టడం జరుగుతుందని డిబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, బామ్ సేఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాంపల్లి అన్నారు. శుక్రవారం దౌల్తాబాద్ మండల కేంద్రం ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం, హక్కులు,చట్టాలు ముఖ్యంగా ఓటు హక్కు వంటి సామాజిక అంశాలు, ప్రభుత్వ పథకాలు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన, చైతన్యం కల్పించేందుకు సామాజిక పరివర్తన పాదయాత్ర దుబ్బాక నియోజకవర్గంలో చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ పాదయాత్ర ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ చైర్మన్, సీనియర్ జర్నలిస్ట్ మల్లెపల్లి లక్ష్మయ్య పాల్గొని ప్రారంభిస్తారని తెలిపారు. ఈ పాదయాత్రలో భాగంగా గ్రామాలలో ప్రజా సమస్యలు, రైతులు, కూలీలు, విద్యార్థులు, ఉద్యోగలు, మహిళలు వారి సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరుగుతుందన్నారు. ఈ పాదయాత్రకు దళిత బహుజన,ప్రజా సంఘాలు, కార్మిక సంఘాలు, విద్యార్థి సంఘాలు, జర్నలిస్టు సంఘాలు, ఉపాధ్యాయ ఉద్యోగ సంఘాలు అన్ని వర్గాల మద్దతిస్తూ సహకారం అందించి విజయవంతం చేయడానికి సహకరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు, రాయపోల్ ప్రెస్ క్లబ్ మండల అధ్యక్షులు పుట్టరాజు, కోశాధికారి నర్సింలు, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు సాయిలు, సీనియర్ జర్నలిస్టు శంభు లింగం, బొల్లం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

సమిష్టి కృషితో రూ .23 లక్షలు వసూలు

నవతెలంగాణ-సిద్దిపేట

డిపో చరిత్రలోనే రికార్డ్ స్థాయిలో గురువారం రాఖీ పౌర్ణమి పండుగ సందర్భంగా సిద్దిపేట డిపో ఉద్యోగుల సమిష్టి కృషితో రూ. 29,32,485 ల అత్యధిక ఆదాయం వచ్చిందని డిపో మేనేజర్ సుఖేందర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 101 శాతం ఆక్యుపెన్సి రేషియో తీసుకువచ్చిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఆర్టీసీని ఆదరించి, ఆర్టీసీ బస్సులోనే ప్రయాణం చేసి, సంస్థ అభివృద్ధికి సహకరించిన ప్రయాణికులకు కృతజ్ఞతలు తెలపారు. ఇదే స్ఫూర్తితో టీం వర్క్ చేసి డిపోను లాభాల బాటలో పయనింపచేయుటకు కృషి చేద్దామని అన్నారు.

పరిహారమివ్వకపోవడం..త్యాగాన్ని మరువడమే

- అధికారుల తీరుపై దాచారం నిర్వాసితుల అవేదన
- మంత్రి అధేశాలను పట్టించుకోని అధికారులు
- నిర్వాసితులకు వరంగా మంత్రి ఆదేశాలు..శాపంగా అధికారుల వివక్ష
- పూర్తిగా పరిహారమందజేయాలని నిర్వాసితుల విజ్ఞప్తి

నవతెలంగాణ-బెజ్జంకి

మెట్టప్రాంత వరప్రదాయనిగా తోటపల్లి ఆన్‌లైన్ రిజార్వాయర్ ఖ్యాతి గడించింది. రిజార్వాయర్ నిర్మాణం కోసం వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగించే ఎందరో రైతులు తమ భూములను త్యాగం చేశారు .రైతన్నల త్యాగాన్ని గుర్తించిన మంత్రి తన్నీరు హరీశ్ రావు రిజార్వయర్ నిర్మాణంలో ముంపునకు గురవుతున్న భూములకు పూర్తిగా పరిహారమందజేయాలనే అధేశాలు వరంగా మారినా. . మంత్రి ఆదేశాలను పట్టించుకోకుండా పరిహారమందజేయడంలో అధికారులు వివక్ష చూపడం రైతుల త్యాగాన్ని మరువడమేనని నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ భూములు కోల్పోయి జీవనోపాధి కరువై దౌర్భాగ్యమైన దుస్థితిని ఎదుర్కొంటున్నామని..తమ త్యాగాన్ని గుర్తించిన మంత్రి ఆదేశాల ప్రకారం సంబంధిత అధికారులు ఇప్పటికైనా పూర్తిస్థాయిలో పరిహారం అందజేయాలని మండల పరిధిలోని దాచారం గ్రామ శివారులోని 499, 207 సర్వే నంబర్ యందు సుమారు.40 ఎకరాలు వ్యవసాయ భూములు కోల్పోయిన ముంపు నిర్వాసితులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అధికారుల తీరుపై సర్వత్ర విమర్శలు

తోటపల్లి ఆన్‌లైన్ రిజార్వాయర్ యందు ముంపునకు గురవుతున్న భూముల్లో ఒక్క రైతుకు పరిహారమందజేసి మరికొందరి రైతులను విస్మరించడం. .స్థానికంగా లేని వారికి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అందజేసి స్థానికంగా ఉండే నిర్వాసితులకు మొండిచెయ్యి చూపడం అధికారులు వివక్ష చూపడమేనని సర్వత్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2017 నుంచి పరిహారమందజేయాలని రెవెన్యూ శాఖాధికారుల చుట్టు నిర్వాసితులు ప్రదక్షిణ లు చేస్తున్నా పట్టించుకోవడం లేదని అవేదన వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూశాఖాధికారులు ఎందరో మారినా పరిహారం అందడం లేదని నిర్వాసితులు వాపోతున్నారు



ఆర్అండ్ఆర్ ప్యాకేజీలో అధికారుల వివక్ష

-బురుగుల లక్ష్మి,నిర్వాసితురాలు దాచారం

రిజార్వయర్ నిర్మాణంలో తమ వ్యవసాయ సాగు భూములు ముంపునకు గురవడంతో సర్వస్వం కోల్పోయాం. స్థానికంగా లేని వారికి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అందజేసి స్థానికంగా ఉన్న వారిని అధికారులు విస్మరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పరిహారమందజేయాలని సూచించిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల పరిహారమందడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నిర్లక్ష్యాన్ని వీడీ పరిహారమందజేసేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలి.

అధికారుల నిర్లక్ష్యమే నిర్వాసితులకు శాపం



తోటపల్లి ఆన్‌లైన్ రిజార్వాయర్ యందు ముంపునకు గురై భూములు కోల్పోతున్న రైతులకు పూర్తిగా పరిహారమందజేయాలని మంత్రి తన్నీరు హరీశ్ రావు అధేశాలిచ్చారు. గత 6 ఎండ్లుగా సంబంధిత అధికారులే దాటవేసే దోరణి అవలంభిస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరించడం నిర్వాసితులకు శాపంగా మారింది. ప్రభుత్వం నిర్వాసితులకు పరిహారమందజేయాలనే కృత నిశ్చయాన్ని అధికారులు నీరుగార్చుతున్నారు. మరోసారి పరిహార సమస్యను మంత్రి దృష్టికి తీసుకువెళ్లడానికి కృషి చేస్తాను.

-కనగండ్ల కవిత, జెడ్పీటీసీ బెజ్జంకి.

సీపీఐ(ఎం)ఆధ్వర్యంలో మోడీ దిష్టిబొమ్మ దహనం

- పెంచిన నిత్యావసర వస్తువుల ధరలను వెంటనే తగ్గించాలి
- సీపీఐ(ఎం)చేర్యాల మండల కార్యదర్శి కొంగరి వెంకట మావో

నవతెలంగాణ-చేర్యాల

పెంచిన నిత్యావసర వస్తువుల ధరలను వెంటనే తగ్గించాలని సీపీఐ(ఎం)చేర్యాల మండల కార్యదర్శి కొంగరి వెంకట మావో కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.పెంచిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం)ఆధ్వర్యంలో శుక్రవారం చేర్యాల మండలం ముస్త్యాల గ్రామంలోని జాతీయ రహదారిపై ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం వెంకట మావో మాట్లాడుతూ నరేంద్ర మోడీ కేంద్ర ప్రభుత్వం నిత్యావసర సరుకుల ధరలను విపరీతంగా పెంచి ప్రజల పై బారాలు మోపుతుందని వెంటనే పెంచిన ధరలు తగ్గించాలని, ప్రజా వ్యతిరేక విధానాలను మానుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం గత తొమ్మిది సంవత్సరాలుగా కార్పొరేట్, భూస్వామ్య విధానాలను అమలు చేస్తూ నూటికి 90 శాతం గా ఉన్న పేద, మధ్యతరగతి, కార్మిక, కర్షక వర్గాల ప్రజల అవసరాలను, సంక్షేమాన్ని పూర్తిగా మరిచిపోయి దేశంలోని బడా కార్పొరేట్ శక్తులకు దోచి పెడుతుందని విమర్శించారు. నూతన కార్మిక చట్టాల పేరుతో కార్మికుల పాత చట్టాలను రద్దుచేసి కొత్తగా నాలుగు కోడ్లను ప్రవేశపెట్టి కార్మికుల పనిగంటలు పెంచి కనీస వేతనాలను అమలు చేయకుండా వ్యవహరిస్తున్నదని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నింటిని బడా కార్పొరేట్లకు అప్పజెప్పి ప్రజల మీద అనేక భారాలు మోపుతున్నారని, విద్యా, వైద్యం ప్రైవేటు పెట్టుబడిదారులకు ధారాదత్తం చేయడం వల్ల పేదలకు విద్యా వైద్యం దూరమైందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్తు ప్రైవేటీకరణతో రైతుల బోరు బావులకు మీటర్లు బిగించి రైతులను వ్యవసాయం నుంచి దూరం చేయాలని కుట్రలు చేస్తుందని విమర్శించారు. రైతులు పండించే ధాన్యాన్ని అమ్ముకోకుండా మార్కెట్లను లేకుండా చేస్తూ మద్దతు ధరను అమలు చేయడం లేదని, ప్రజా పంపిణీ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసిందని గతంలో 14 రకాల నిత్యవసర సరుకులను రేషన్ దుకాణాల ద్వారా పేదలకు అందించేదని ఈ బీజేపీ ప్రభుత్వం వచ్చాక నిత్యవసర వస్తువులను ప్రజా పంపిణీ వ్యవస్థను బలహీనపరిచిందని తెలిపారు. దేశంలో నిరుద్యోగం రోజురోజుకు పెరుగుతుందని, ఆకలి చావులు పెరిగిపోతున్నాయని, మతోన్మాదాన్ని పెంచి పోషిస్తూ మైనార్టీ ప్రజలైన క్రైస్తవులు, ముస్లిలు, గిరిజనులపైన మారణ హోమం సృష్టిస్తుందని, మణిపూర్ లో జరుగుతున్న మారణ హోమాన్ని ప్రోత్సహిస్తుంది తప్ప నిలిపివేయడానికి ఏ చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు.అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని రద్దుచేసి మనువాదాన్ని దేశంలో అమలు చేయాలని కుట్రలు పన్నుతు, వివిధ మతాల ప్రజలు గల ఈ భారతదేశాన్ని హిందూ దేశంగా మార్చాలని చరిత్రను వక్రీకరిస్తూ ప్రశ్నిస్తున్న వారిని నిర్దాక్షణ్యంగా జైళ్లకు పంపుతూ నిరంకుశంగా వ్యవహరిస్తున్న ఈ కేంద్ర ప్రభుత్వం బీజేపీ నరేంద్ర మోడీ విధానాలను దేశంలోని పేద, మధ్య తరగ తి కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, వృత్తిదారులు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ప్రజలంతా ఏకమై మోడీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పే విధంగా పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముస్త్యాల గ్రామ పార్టీ శాఖ కార్యదర్శి రేపాక కుమార్, గుం ద్ర రవీందర్, ఎండి. ఎజాస్, బైకని శ్రీనివాస్, చిమ్మా రవి, లక్ష్మణ్, కర్రె సత్తయ్య ,పెంటయ్య పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని చిట్యాల, గుజ్జ కుంట తదితర గ్రామాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో కాసెట్టి ఆంజనేయులు, దర్శనం రమేష్, మల్కని ఎల్లయ్య, తిరుపతి, ఎలా శంబయ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



విద్యాసంస్థల బందును విజయవంతం చేయాలి

- జేఏసీ చైర్మన్ డాక్టర్ రామగల్ల పరమేశ్వర్

నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల రెవెన్యూ డివిజన్ ఆకాంక్షను ప్రతి విద్యార్థి కుటుంబానికి చేరవేయాలని రెవిన్యూ డివిజన్ సాధన సమితి చైర్మన్ డాక్టర్ రామగల్ల పరమేశ్వర్ అన్నారు. చేర్యాల మండల కేంద్రంలో శుక్రవారం పరమేశ్వర్ విలేకరులతో మాట్లాడుతూ చేర్యాలను ప్రభుత్వం వెంటనే డివిజన్ ఏర్పాటు చేయాలని శనివారం విద్యాసంస్థల బందుకు పిలుపునిచ్చామని తెలిపారు. చేర్యాల ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాన్ని ప్రాంత అస్తిత్వం కోసం జరిగే పోరాటాన్ని తెలియజేస్తూ చేర్యాల రెవెన్యూ డివిజన్ ఆకాంక్షలు ప్రతి విద్యార్థి కుటుంబానికి, ప్రజానికానికి చేరవేసేందుకే విద్యాసంస్థల బందుకు పిలుపునిస్తున్నామన్నారు. విద్యాసంస్థల బందుకు చేర్యాల, మద్దూరు, కొమురవెల్లి, దూలిమిట్ట మండలాలలోని ప్రభుత్వ ప్రైవేటు ప్రాథమిక పాఠశాల నుంచి డిగ్రీ కళాశాల వరకు అన్ని విద్యా సంస్థల బంద్‌కు విద్యాసంస్థల యాజమాన్యాలు ఈ ప్రాంత ప్రజలు సహకరించి తరగతులు బహిష్కరించాలని కోరారు. పరమేశ్వర్ వెంట జేఏసీ కో చైర్మన్ పుర్మ ఆగంరెడ్డి, జేఏసీ నియోజకవర్గ నాయకుడు అందె అశోక్, మండల కన్వీనర్ బొమ్మగోని అంజయ్య గౌడ్, పట్టణ కన్వీనర్ తాడెం ప్రశాంత్, బిజ్జ రాము, ఆముదాల రంజిత్ రెడ్డి, వెలుగల రఘువీర్ తదితరులు ఉన్నారు.

నవతెలంగాణ-మద్దూరు

చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధన కోసం నేడు తలపెట్టే విద్యాసంస్థల బందును ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని చేర్యాల జేఏసీ డివిజన్ నాయకులు చెట్కూరి కమలాకర్ యాదవ్ కోరారు. ఈ సందర్భంగా దూల్మిట్ట మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించే వరకు ఉద్యమాన్ని ఆపేది లేదని ఆయన అన్నారు.నేడు తలపెట్టే విద్యాసంస్థల బందును ప్రతి ఒక్కరు విజయవంతం చేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో మండల జేఏసీ కో- కన్వీనర్ సుందరగిరి భాస్కర్.జేఏసీ నాయకులు గద్దల మహేందర్,గోనెపల్లి రమేష్,సుద్దాల నరసింహులు, సాంబయ్య,తదితరులు పాల్గొన్నారు.



దూల్మిట్టలో కస్తూర్బా పాఠశాల ఏర్పాటుపై డీఈవో పరిశీలన

నవతెలంగాణ-మద్దూరు

దూల్మిట్ట మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం కస్తూర్బా గాంధీ పాఠశాలను మంజూరు చేయడంతో పాఠశాల ఏర్పాటు కోసం ఉన్నత పాఠశాలలో వసతులను సిద్దిపేట జిల్లా డీఈవో శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా మండలంగా ఏర్పడ్డ దూల్మిట్ట మండలంలో కస్తూర్బా గాంధీ పాఠశాలను మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సంవత్సరం 6, 7 తరగతి తో విద్యా సంవత్సరాన్ని ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా దూల్మిట్ట మండల కేంద్రానికి పరిశీలనకు వచ్చిన డీఈవో శ్రీనివాసరెడ్డిని సర్పంచ్ దుబ్బుడు దీపికా వేణుగోపాల్ రెడ్డి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మొగుళ్ల నరసింహారెడ్డి.ఉపాధ్యాయులు.సిఆర్పిలు తదితరులు పాల్గొన్నారు

దూల్మిట్ట కస్తూర్బా గాంధీ పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభం

దూల్మిట్ట మండలంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో 2023-2024 విద్యా సంవత్సరానికి 6 ,7 తరగతులకు 80 దరఖాస్తులు స్వీకరించినట్లు ఎంఈఓ మొగుళ్ల నరసింహారెడ్డి శుక్రవారం విలేకరులకు తెలిపారు. మండల కేంద్రంలో కస్తూర్బా గాంధీ పాఠశాలలో చేరే విద్యార్థులు ఆరవ తరగతిలో 40, ఏడో తరగతిలో 40 సీట్లు ఖాళీ ఉన్నట్లు ఆయన తెలిపారు ఇంగ్లీష్ మీడియంలో బోధన ఉంటుందని ఆసక్తిగల విద్యార్థులు ఈ నెల 6వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు వివరాల కోసం కస్తూర్బా గాంధీ పాఠశాల ఎస్ఓ స్వప్న సెల్ నెంబర్ 9493972765 లో సంప్రదించాలని ఆయన కోరారు.



సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి





నవతెలంగాణ-బెజ్జంకి



సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఎస్టీయు ఉపాధ్యాయ సంఘం నాయకులు శుక్రవారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని బాలికల ప్రభుత్వోన్నత పాఠశాల మధ్యాహ్న భోజన విరామ సమయంలో సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని ఎస్టీయు ఆధ్వర్యంలో ఉపాధ్యాయు నల్ల బ్యాడ్జిలు దరించి నిరసన తెలిపారు. ఎస్టీయు జిల్లా ఆర్థిక కార్యదర్శి వడ్లకొండ శ్రీనివాస్,జిల్లా కౌన్సిలర్ శంకరా చారి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-గజ్వేల్

పెన్షన్ విద్రోహ దినం సందర్బంగా నల్ల బ్యాడ్జీలతో నిరసనకు రాష్ట్ర శాఖ ఇచ్చిన పిలుపు మేరకు సిద్దిపేట పీఆర్టియు జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. పీఆర్‌టీయూ అధ్యక్షులు ఆదరాసుపల్లి శశిధర్ శర్మ మండల శాఖ అధ్యక్షులు ఊడెం వేమారెడ్డిల ఆధ్వర్యంలో ప్రజ్ఞాపూర్ గజ్వేల్ శిక్షణ కార్యక్రమాల్లో శిక్షణకు హాజరై మధ్యాహ్న భోజన సమయంలో సిపిఎస్ రద్దు చేయాలని నిరసన తెలిపారు. ఈ సందర్బంగా పిఆర్టియు సిద్దిపేట జిల్లా శాఖ అధ్యక్షులు ఆదరాసుపల్లి శశిధర్ శర్మ మాట్లాడుతూ సిపిఎస్ పథకం వెట్టి చాకిరి విధానమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సిపిఎస్ పథకాన్ని రద్దు చేసి ఓపిఎస్ పథకం ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమాల్లో గజ్వేల్ మండల శాఖ అధ్యక్షుడు ఊడెం వేమారెడ్డి రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు పి రామకృష్ణారెడ్డి, హన్మంత రెడ్డి, వర్గల్ మండల శాఖ అధ్యక్షులు ఎం భాస్కర్ రెడ్డి ములుగు మండల శాఖ అధ్యక్షులు వెంకట నరసింహారెడ్డి జగదేవపూర్ మండల శాఖ అధ్యక్షులు వెంకట్రాంరెడ్డి రాష్ట్ర నాయకులు స్కర్ అజయ్ కుమార్ రెడ్డి ఏ శ్రీనివాస్ రాధిక సంధ్య శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న రవీందర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, భాస్కర్ డి.వి.యన్.రెడ్డి, షాభోద్దీన్ , జిల్లా నేతలు వెంకటేష్ గౌడు, మండల నేతలు మధునాల శ్రీనివాస్, భూపతి రెడ్డి, భూపాల్ రెడ్డి తోపాటు ఉపాధ్యాయులందరూ మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసనలో పాల్గొన్నారు.

నవతెలంగాణ-దౌల్తాబాద్

పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా తహసిల్దార్ దండు సుజాతకు ఉద్యోగుల పాలిట శాపంగా మారిన కాంట్రి బ్యూటరీ పెన్షన్‌ను రద్దు చేయాలని కోరుతూ ఉపాధ్యాయులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పి ఆర్ టి యు దౌల్తాబాద్ మండలం ప్రధాన కార్యదర్శి త్యాగరాజు మాట్లాడుతూ పెన్షన్ అనేది ఉద్యోగి హక్కు అని, దీనిని హరించడం సమంజసం కాదన్నారు. మండలంలోని అన్ని పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు అందరూ నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరు కావడం జరిగిందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యోగ ఉపాధ్యాయులందరికీ పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిఆర్టియు దౌల్తాబాద్ మండల అధ్యక్షులు రాజి రెడ్డి ,ప్రధాన కార్యదర్శి త్యాగరాజు ,నాయకులు రాజసింహ, వేణుగోపాల్ ,సర్దార్ హుస్సేన్,అనిల్ కుమార్ , రాజశేఖర్, విష్ణువర్ధన్ రెడ్డి రవి, నాగరాజు, వనజ ,వినోద వసంతలక్ష్మి ,మహేష్, తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ-దుబ్బాక

ఉద్యోగుల పాలిట శాపంగా మారిన నూతన సిపిఎస్ విధానాన్ని వ్యతిరేకిస్తూ దుబాక పురపాలిక పరిధిలోని ధర్మాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రభుత్వ ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. సెప్టెంబర్ 1ని పెన్షన్ విద్రోహ దినోత్సవంగా అభివర్ణిస్తూ మధ్యాహ్న భోజన విరమణ సమయంలో ఈ నిరసన తెలపడం జరిగిందన్నారు. పాత ఓపిఎస్ విధానంతోనే ఉద్యోగులకు మేలు జరుగుతుందన్నారు. ఉపాధ్యాయులు జే.విష్ణువర్ధన్, ఎండి.సాధత్ అలి, సిహెచ్. నరేందర్, డి.కృష్ణమూర్తి, కాల్వ శ్రీకాంత్, వి.నరేష్, పి.ఇందిర, చంద్రశేఖర్, రాజేందర్ పలువురున్నారు.



నవతెలంగాణ-చేర్యాల

కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం కలిగిస్తుందని దానిని వెంటనే రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం పిఆర్టియు చేర్యాల మండల శాఖ ఆధ్వర్యంలో మండలంలోని 50 పాఠశాలలలో 205 మంది ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ జోగినిపల్లి రాజేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు జంగా శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కే. వెంకన్న, నరసింహారెడ్డి, పిఆర్టియు సభ్యులు మాధవరెడ్డి, హేమలత, అరుణ, సుజాత, ఉమా దేవి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
5
శనివారం | సెప్టెంబరు 02 2023 | www.navatelangana.com

సెప్టెంబర్ 3న గద్దర్, సాయిచంద్ సంస్మరణ సభ

నవతెలంగాణ-దుబ్బాక



ప్రజాయుద్ధనౌక దివంగత గద్దర్, ప్రజా గాయకుడు దివంగత సాయిచంద్‌ల సంస్మరణ సభ 'సెప్టెంబర్ 3న దుబ్బాకలోని సాయి బాలాజీ గార్డెన్స్'లో ఉదయం 10 గంటలకు నిర్వహించడం జరుగుతుందని దళిత సంఘాల రాష్ట్ర నాయకులు ర్యాకం శ్రీరాములు, కరికె శ్రీనివాస్, వైస్ ఎంపీపీ అస్క రవి తెలిపారు. శుక్రవారం దుబ్బాక పట్టణ కేంద్రంలో దళిత సంఘాల నేతలు సమావేశమై మీడియాతో మాట్లాడారు. ఈ సంస్మరణ సభకు ముఖ్య అతిథులుగా ఏపూరి సోమన్న, మిట్టపల్లి సురేందర్, గద్దర్ అన్న కూతురు వెన్నెల హాజరవుతున్నట్లు తెలిపారు. దుబ్బాక నియోజకవర్గంలోని దళిత, బహుజన, మైనారిటీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, అభిమానులు హాజరై సభను జయప్రదం చేయాలని వారు కోరారు. మున్సిపల్ కౌన్సిలర్లు ఇల్లందుల శ్రీనివాస్, బత్తుల స్వామి, ఆస యాదగిరి, కోఆప్షన్ సభ్యుడు ఆస స్వామి, చీకోడ్ సర్పంచ్ తౌడ శ్రీనివాస్, నాయకులు బండమీది మల్లయ్య, ఆస పెద్ద ముత్యం, సంగెపు స్వామి, చింతల ప్రభాకర్ ఉన్నారు.

రోడ్డుకెక్కిన సామాగ్రి

నవతెలంగాణ-గజ్వేల్



గజ్వేల్ నుండి ప్రజ్ఞపూర్ వరకు, ఇందిర పార్క్ నుంచి ఢిల్లీ వాల హెూటల్ వరకు,ప్రభుత్వ దవాఖాన నుంచి వైకుంఠ దామం వరకు రోడ్ల పైన సామాగ్రి పెట్టారు. వర్గల్ కమాన్ నుంచి భవనం వరకు గల రోడ్లలో వ్యాపారస్తులు స్టీల్ షాప్ కానీ, బట్టల దుకాణంలో వారు కానీ అన్ని దుకాణముల వారు రోడ్ మీది వరకు సామానులు పెట్టడంతో వాహనదారులు, పాదాచారులు చాలా ఇబ్బంది పడుతున్నారు. వాటిపైన పోలీస్, మున్సిపల్ వారు ఇరువురు వీటిపైన దృష్టి పెట్టి వాహనదారులకు ఇబ్బంది లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

దామాషా ప్రకారం ముదిరాజులకు ఎమ్మెల్యే సీట్లను కేటాయించాలి

నవతెలంగాణ-మర్కుక్



తెలంగాణ ప్రభుత్వం ముదిరాజుల దామాషా ప్రకారం ఎమ్మెల్యే సీట్లను కేటాయించాలని చేబర్తి ఉపసర్పంచ్ గుర్రాల స్వామి ముదిరాజ్ డిమాండ్ చేశారు.శుక్రవారం మండల పరిధిలోని చేబర్తి గ్రామంలో గల పెద్దమ్మ ఆలయ వద్ద ముదిరాజ్ సంఘం గ్రామాధ్యక్షులు గుర్రాల సురేష్ ముదిరాజ్ తో కలసి ముదిరాజులు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ముదిరాజులపై వివక్షత చూపుతుందని అవేదన వ్యక్తం చేశారు. బీసీలకు లక్ష రూపాయల రుణమిస్తున్నట్లు ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వం ఆ జాబితాలో ముదిరాజులను చేర్చకపోవడం సరికాదన్నారు. చేపల పంపిణీలో కూడా ముదిరాజులకు వివక్ష ఎదురైందన్నారు. రాష్ట్రంలో ముదిరాజుల జనాభా 50 లక్షలకు పైగా ఉందన్నారు. అటువంటి ముదిరాజులను రాజకీయంగా, సామాజికంగా బలహీనపరిచేందుకు ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని అనుమానాలను వ్యక్తం చేశారు. తమకు ప్రాధాన్యం కల్పించే రాజకీయ పార్టీలకు మద్దతు ఇస్తామన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్న రాజకీయ పార్టీలకు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఉపాధ్యక్షులు సత్యనారాయణ, చేబర్తి ముదిరాజ్ సంఘం మాజీ అధ్యక్షులు తోటసాయిలు, గ్రామ ముదిరాజ్ లు వార్డు సభ్యులు తోట అంజనేయులు, నాయకులు గుర్రాల కుమార్, పోయిల కనకయ్య,తోట ప్రకాశ్,యాదగిరి, సత్యనారాయణ, దేశమైన నర్సింలు, చంద్రం, బీమరి రమేష్,మల్లయ్య, యాదగిరి, తదితరులున్నారు.

చెత్తలేని పట్టణంగా నిర్మించడమే లక్ష్యం

నవతెలంగాణ-సిద్దిపేట



అరుబయట చెత్తల ని పట్టణంగా సిద్దిపేట ను నిర్మించడమే తమ లక్ష్యమని మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ జంగిటి కనకరా జు, స్థానిక వార్డు కౌన్సిలర్ ఫాతిమా బేగం-వజీర్‌లు అన్నారు. శుక్రవారం 30వ వార్డ్ లో నడుస్తూ చెత్త ఏరివేద్దాం కార్యక్రమము నిర్వహించారు. ఈ సందర్భంగా రాజనర్సు మాట్లాడుతూ మంత్రి హరీశ్ రావు పట్టణ ప్రజల ఆరోగ్యం గూర్చి, చెత్త లేని పట్టణంగా తీర్చిదిద్దడానికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. మొదటి దశ చెత్త ఏరివేద్దాం కార్యక్రమంలో భాగంగా పట్టణంలో 43 వార్డులలో పూర్తిగా కలియతిరిగుతూ, అరుబయట ఉన్న చెత్తను ఏరివేయడం జరిగిందన్నారు. ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే మంత్రి కళ అని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కౌన్సిలర్లు, కో-అప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ముత్రాజ్పల్లి చౌరస్తా సుందరీకరణ పనులు ప్రారంభం

నవతెలంగాణ -గజ్వేల్



గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ముత్రాజ్పల్లి చౌరస్తా సుందరీకరణ పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. స్థానిక కౌన్సిల్ సభ్యులు శ్యామల మల్లేష్ యాదవ్ స్థానికులతో కలిసి పనులు పరిశీలించారు. గజ్వేల్ అంబేద్కర్ చౌరస్తా నుంచి ముత్రాజ్పల్లి సర్కిల్ వద్ద సుందరీకరణ పనులను చేపడుతున్నారు. నెల రోజుల్లో పనులు పూర్తయ్యే అవకాశం ఉంది. ఈ సందర్భంగా కౌన్సిల్ సభ్యులు శ్యామల మల్లేశం యాదవ్ మాట్లాడుతూ పనులు నాణ్యతగా జరగాలని ఆయన సూచించారు. సీఎం కేసీఆర్ ప్రాతినిధ్య వహిస్తున్న నియోజకవర్గం కేంద్రం గజ్వేల్ కావడంతో సుందరీకరణ అవసరమని మున్సిపల్ పాలకవర్గం పలు స్థలాలను గుర్తించి సర్కిల్ వద్ద సుందరీకరణ పనులు చేపడుతుందన్నారు. మంత్రి హరీష్ రావు ఆదేశాల మేరకు పనులు వేగవంతంగా చేస్తున్నారన్నారు. ఈ సుందరీకరణ పనులు రూ 50 లక్షల నిధుల ద్వారా చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. మున్సిపల్ పరిధిలోని ఐదో వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

నంగునూరులో మార్కండేయ స్వామి శోభ యాత్ర



నవతెలంగాణ-నంగునూరు

రాఖీ పౌర్ణమి (నూలు పౌర్ణమి) సందర్భంగా మండల కేంద్రంలో పద్మశాలి సమాజం ఆధ్వర్యంలో గురువారం రాత్రి మార్కండేయ స్వామి శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన వీధుల గుండా మార్కండేయ స్వామి విగ్రహాన్ని ఊరేగించారు. చిన్నారులు, మహిళలు మంగళ హారతులతో స్వామికి స్వాగతం పలికారు. చిన్నారులు నృత్యాలు చేస్తూ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నంగునూరు పద్మశాలి సమాజం అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, కుల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎంఎస్‌డి ప్రీమియర్ లీగ్ పోటీలకు ఎంపికైన సిద్దిపేట క్రీడాకారులు

నవతెలంగాణ-సిద్దిపేట



మారుమూల ప్రాంతంలో ప్రతిభ కలిగిన క్రీడాకారులను వెలికి తీసే ప్రయత్నంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర స్థాయిలో ఎంఎస్ ధోనీ క్రికెట్ అకాడమీ హైదరాబాద్ వారు అండర్ 14 క్రీడాకారుల కోసం సెలక్షన్స్ "ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో " ఆదివారం నిర్వహించారు. ఈ సెలెక్షన్స్‌లో సిద్దిపేట జిల్లా క్రికెట్ అసోసియేషన్ క్రీడాకారుల నుంచి ముగ్గురు క్రీడాకారులు వికెట్ కీపర్, బ్యాట్స్మెన్ సాయి హర్షిత్, బౌలింగ్ విభాగంలో అఖిల్ రఘువీర్ , బౌలింగ్ , బ్యాటింగ్‌లో లక్ష్మీ సహస్ర ఎంపికైనట్లు సిద్దిపేట క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్ తెలిపారు. సిద్దిపేటలో అంతర్జాతీయ స్థాయిలో క్రికెట్ గ్రౌండ్ ఏర్పాటు చేసి, మౌలిక సౌకర్యాలను అందించిన మంత్రి హరీశ్ రావు చొరవతో క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో ఎంపిక అవుతున్నారన్నారు. ఎంపికైన క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు బజ్జి, మధు, బాబు ,అమీర్ జాని, మాజిత్ లు పాల్గొన్నారు.

అనారోగ్యంతో అటెండర్ మృతి

నవతెలంగాణ-మద్దూరు



మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న నాగయ్య అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. అటెండర్‌గా నాగయ్య ఎనిమిది సంవత్సరాలుగా తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహించి అధికారుల ప్రజల మన్ననలు పొందాడని గుర్తు చేసుకున్నారు. నాగయ్య స్వస్థలం కడవెరుగు గ్రామానికి తహసిల్దార్ కార్యాలయం సిబ్బంది ఆర్ఐ రమేష్, జూనియర్ అసిస్టెంట్లు సందీప్, మౌనిక,సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అటెండర్ నాగయ్య దహన సంస్కారాల కోసం ప్రభుత్వం తరపున తహసిల్దార్ రూ.20వేలను కుటుంబానికి అందించారు.

చదువుతోపాటు క్రీడలు అవసరం

- విద్య వైద్యానికి పెద్ద పీట
- జెడ్పీ చైర్ పర్సన్ రోజా శర్మ
- అట్టహాసంగా ప్రారంభమైన ఎస్‌జిఎఫ్ క్రీడలు

నవతెలంగాణ-కొండపాక

విద్యార్థి దశ నుంచి చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ వేలేటి రోజా రాధా కిషన్ శర్మ అన్నారు. కుకునూరుపల్లి మండల కేంద్రంలో ఎస్‌జిఎఫ్ క్రీడలు ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొనడం కోసం ఈ క్రీడలు తొలిమెట్టులాంటివన్నారు. ఆటల్లో నైపుణ్యత పెంపొందించుకొని జాతీయ స్థాయి క్రీడలుగా ఎదిగి గ్రామానికి రాష్ట్రానికి పేరు తీసుకురావాలన్నారు. ఉన్నత చదువులకు సైతం స్పోర్ట్స్ కోటా ఉంటుందని దానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. యువతను క్రీడల్లో ప్రోత్సహించడానికి అన్ని గ్రామాల్లో గ్రామీణ క్రీడా ప్రాంగణాలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి హరీష్ రావు ప్రత్యేక కృషితో సిద్దిపేటలో క్రీడా మైదానాలు స్టేడియంలో ఏర్పాటు అయ్యాయని వాటిలో ఎంతో మంది క్రీడాకారులకు నైపుణ్యత పెంపొందించే అవకాశాలున్నాయన్నారు. విద్య వైద్యానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించి కృషి చేస్తుందన్నారు. పరిపాలన సౌలభ్యం కోసం కొత్త మండలాలు, జిల్లాలు రాష్ట్రంలో ఏర్పాటయ్యాయని ఇది సీఎం కేసీఆర్ కృషితో జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, ఎఫ్ డి సి చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి, డీఈవో శ్రీనివాసరెడ్డి, ఎంఈఓ శ్రీనివాసరెడ్డి పాఠశాల హెచ్ఎం బాలకిషన్, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు వంగ నాగిరెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాధా కిషన్ శర్మ బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కందూరి ఐలయ్య, గ్రామ సర్పంచ్ పొల్కంపల్లి జయంతి నరేందర్, ఎస్ జి ఎఫ్ కార్యదర్శి రామేశ్వర్ రెడ్డి, పిఏసిఎస్ వైస్ చైర్మన్ అమరేందర్, ఎస్ఎంసి చైర్మన్ ఐలయ్య, పిఎన్ఆర్ సంస్థ చైర్మన్ నరేందర్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా క్రీడలు ప్రారంభం

జిల్లా పరిషత్ ఉన్న ఉచిత పాఠశాల ఆవరణలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మండల స్థాయి క్రీడలు అయినప్పటికీ జిల్లా, రాష్ట్రస్థాయి లెవల్లో ఏర్పాట్లు చేశారు. విద్యార్థులకు ఎక్కడ దెబ్బలు తగలకుండా మ్యాట్లు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి వచ్చిన అతిథులు కబడ్డీ ఆడి విద్యార్థులను ప్రోత్సహించారు.





ప్రైవేట్ పాఠశాల దీటుగా ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తుంది

- దళితుల అభివృద్ధికి ప్రభుత్వ కృషి మరువలేనిది
- ఎంపీపీ గజ్జల సాయిలు జెడ్పీటీసీ లక్ష్మీ లింగం

నవతెలంగాణ-మిరుదొడ్డి

ప్రైవేట్ పాఠశాల దీటుగా ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తుందని ఎంపీపీ గజ్జల సాయిలు, జెడ్పీటీసీ లక్ష్మీ లింగం, డీసీసీబీ జిల్లా డైరెక్టర్ బక్కి వెంకటయ్య ఆత్మ కమిటీ చైర్మన్ భాస్కరాచారిలు అన్నారు. శుక్రవారం మిరుదొడ్డి మండలం కసులాబాద్ గ్రామంలో మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా నూతన భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఎస్సీ కమ్యూనిటీ హాళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవతో ప్రతి గ్రామ గ్రామాన కమ్యూనిటీ హాలు, కనీస సౌకర్యాలు అందిస్తున్నారన్నారు. ఎస్సీ కమిటీ నిర్మాణానికి సహకరించిన ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, మంత్రి హరీష్ రావులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కాసులాబాద్ గ్రామాన్ని మరింత అభివృద్ధి చేయడానికి ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను చేస్తూ అల్లరించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవతో ప్రతి గ్రామంలో నిరుపేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు నర్సింలు లక్ష్మీ సర్పంచ్ తుమ్మల బాలరాజు, జంగం నాగరాజు, గ్రామస్తులు రాజు, ముత్యాల భూపాల్, ప్రవీణ్, రత్నం తో పాటు తదితరులు పాల్గొన్నారు.



బీసీల వాణిని ప్రగతి భవన్‌కు చేరకుండా అడ్డుకుంటున్నారు

- జనగామ బీఆర్ఎస్ టికెట్ తనకే ఇవ్వాలి
- పల్లా, పోచంపల్లి, ఎమ్మెల్సీలుగా ఉన్నారు
- రక్తంతో కేసిఆర్ చిత్రపటంకు వీర తిలకం
- ఆప్కో మాజీ చైర్మన్ మండల శ్రీరాములు

నవతెలంగాణ-కొమురవెల్లి

బీసీల వాణిని ప్రగతి భవన్‌కు చేరకుండా అడ్డుకుంటున్నారని జనగామ బీఆర్ఎస్ టికెట్ ఆశిస్తున్న ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డిలపై ఆప్కో మాజీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నేత మండల శ్రీరాములు పరోక్ష విమర్శలు చేశారు. శుక్రవారం సీఎం కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ, స్థానికుడినైన, బీసీ వర్గానికి చెందిన తనకు జనగామ అసెంబ్లీ టికెట్ ఇవ్వాలని కోరితూ కొమురవెల్లి మల్లన్న ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ముడుపు కట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనగామ నియోజకవర్గ అసెంబ్లీ టికెట్ తనకే కేటాయించాలని వేడుకుంటూ, సీఎం కేసీఆర్ వీర అభిమానినంటూ కేసీఆర్ చిత్రపటానికి తన రక్తంతో వీర తిలకం దిద్దారు. సీఎం కేసీఆర్.. పల్లా రాజేశ్వర్ రెడ్డి, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డిలకు ఎమ్మెల్సీలుగా అవకాశం ఇచ్చారని ఇంకా నాలుగు సంవత్సరాలు వారికి పదవీకాలం ఉండగానే జనగామ టికెట్ ఆశించడం సిగ్గుచేటన్నారు. సీఎం కేసీఆర్ అభ్యర్థులను ప్రకటించకముందే నియోజకవర్గంలో తేర చాటున స్వైర విహారం చేస్తున్నారని మండిపడ్డారు. రెడ్డి వర్గానికి చెందిన మీకు టికెట్ ఇస్తే ఇక్కడి ప్రజలు క్షమించబోరని పేర్కొన్నారు. పల్లా రాజేశ్వర్ రెడ్డి, పోచంపల్లి శ్రీనివాసరెడ్డిలు ఇక్కడి బీసీలను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారని ఇలాంటి పనులు మానుకోవాలని హెచ్చరించారు. బీసీ వర్గానికి చెందిన నన్నే జనగామ అసెంబ్లీ అభ్యర్థిగా ప్రకటించి న్యాయం చేయాలంటూ సీఎం కేసీఆర్‌ను వేడుకున్నారు. ఆయన వెంట మద్దూరు, దూల్మిట్ట, చేర్యాల మండలాల బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.



స్వరాష్ట్రంలోనే దేవాలయాల అభివృద్ధి

నవతెలంగాణ-కోహెడ



స్వరాష్ట్రంలోనె దావాలయాలు అభివృద్ధి చెందాయని కూరెళ్ళ గ్రామ సర్పంచ్ గాజుల రమేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని కూరెళ్ళ గ్రామంలో శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయ ప్రవేశ ద్వారానికి గడప ప్రతిష్టాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌడ కులస్థుల ఆధ్వర్యంలో దేవాలయాన్ని నూతనంగా నిర్మిస్తున్నట్లు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తాళ్లపల్లి ఎల్లయ్యగౌడ్, కోనవేని రవి, బత్తిని వెంకన్నగౌడ్, ముంజ లింగయ్యగౌడ్, ముంజ వెంకటయ్య, కత్తి సత్తయ్య, బుర్ర వెంకట స్వామి, ముంజ నర్సయ్య, ముంజ కనుకయ్య, ముంజ రాయమల్లు, ముంజ సంపత్, తాళ్ళపల్లి నర్సయ్య, బుర్ర పర్శరాములు, కత్తి మహేందర్, కత్తి రవీందర్, కత్తి స్వామి, కత్తి రమేశ్, బత్తిని భిక్షపతి, ముంజ శ్రీనివాస్, ముంజ రమేశ్, మహిళలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- నేడు, రేపు ఓటు దరఖాస్తుకు అవకాశం
- తహశీల్దార్ లక్ష్మీనారాయణ

నవతెలంగాణ-కొమురవెల్లి:

ఓటరు నమోదు కార్యక్రమాన్ని గ్రామాలలో ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ లక్ష్మీనారాయణ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జనగామ జిల్లా ఎన్నికల అధికారి ఆదేశానుసారం శని, ఆదివారాలలో గ్రామాల్లో బూత్ స్థాయి అధికారులతో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఫారం 6 ద్వారా నూతన ఓటుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఫారం 7 ద్వారా చనిపోయిన వారి తొలగింపులు, డబల్ పేర్లు ఉన్నవారు సమాచారం ఇవ్వాలని, ఫారం 8 ద్వారా ఇంటి పేరు, తండ్రి పేరు, ఆడ మగ, చిరునామా తప్పుగా ఉన్నవారు దరఖాస్తు చేసుకుంటే సవరణలు చేయబడతామన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అదుపు తప్పి విద్యుత్ స్తంభానికి ఢీకొట్టిన టెంపో ట్రావెలర్

- 9 మందికి గాయాలు

నవతెలంగాణ-కొండపాక





టెంపో ట్రావెలర్ డ్రైవర్‌కు మూర్ఛ రావడంతో అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో 9 మందికి గాయాలైన సంఘటన గురువారం రాత్రి కొండపాక శివారులో గాయత్రి దేవాలయం సమీపంలో రాజీవ్ రహదారిపై జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. హైద్రాబాద్ మియాపూర్ ఒకే కుటుంబానికి చెందిన పలువురు గురువారం వేములవాడ దైవదర్శనానికి వెళ్లారు. తిరిగి హైదరాబాద్ వెళుతున్న క్రమంలో రాత్రి డ్రైవర్‌కు మూర్ఛ వచ్చింది. దీంతో వాహనం అదుపుతప్పిన ట్రావెలర్ రోడ్డు కిందికి దూసుకెళ్లి విద్యుత్ స్తంభానికి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సందీప్ (32), శ్రావణి (28), శామల (38) కు తీవ్రమైన గాయాలు కాగా, కావేరి (10), సమీక్ష (12), మంజునాథ్ (15), అఖిల్ (5), శ్రీపాల్ (30). లకు స్వల్ప గాయాలయ్యాయి సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది మహేందర్, శ్రీనివాస్‌లు చేరుకొని ప్రథమ చికిత్స చేసి వారిని సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. విద్యుత్ వైర్లు ఒకదానికి ఒకటి తాకి మంటలు వచ్చాయి. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించి సహాయక చర్యలు చేపట్టారు.

మెగా డీఎస్సీని వెంటనే వేయాలి

నవతెలంగాణ-మిరుదొడ్డి



నిరుద్యోగులకు ఉద్యోగం కల్పించేందుకు ప్రభుత్వం వెంటనే మెగా డిఎస్సిని ప్రకటించాలని నిరుద్యోగ యువకుడు కిషన్ డిమాండ్ చేశారు. మిరుదొడ్డి మండలం లింగుపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగులు ఉద్యోగం వస్తదేమోనని ఆశపడుతూ ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొందని వాపోయారు. ఉద్యోగం లేక ఆర్థిక ఇబ్బందులతో కుటుంబాలకు భారంగా నిరుద్యోగులు మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే మెగా డీఎస్సీని ప్రకటించాలని విన్నవించారు. తెలంగాణ రాష్ట్రంలో 13080 పోస్టులను ఇస్తారని చెప్పిన ప్రభుత్వం నేటికీ ఇవ్వకపోవడం బాధాకరం అన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే యువకులకు ఉద్యోగాలు ఏర్పడతాయని ఆశతో ఉన్నవారికి ముఖ్యమంత్రి కేసీఆర్ ఉద్యోగాలు వేయకపోవడంతో నిరుత్సాహానికి గురి కావడం జరుగుతుందన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక చొరవతో మెగా డీఎస్సీ ఏర్పాటు చేస్తే నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బిక్షపతి కిరణ్ తదితరులు ఉన్నారు.

శేష జీవితం సుఖంగా గడపాలి

- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివకుమార్

నవతెలంగాణ-సిద్దిపేట

పదవి విరమణ జీవితానికి ముగింపు కాదని, పదవీ విరమణ తర్వాత శేష జీవితం కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని, సుఖంగా ఉండాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివకుమార్ అన్నారు. వ్యవసాయ శాఖలో పనిచేస్తున్న సులోచన పదవి విరమణ కావడంతో శుక్రవారం ఎన్జీవోస్ భవన్ లో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగంలో ఉన్నప్పుడు కుటుంబాని కంటే ఎక్కువగా ప్రభుత్వ కార్యాలయాలలోనే జీవితం గడుస్తుందన్నారు. మీరు చేసిన సేవలే పదవీ విరమణ తర్వాత కూడా తోటి ఉద్యోగులకు గుర్తుకు ఉంటాయన్నారు. సుఖ సంతోషాలతో, ఆరోగ్యంగా ఉండి, మీ శేష జీవితం గడపాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. టీఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షులు గ్యాదర్ పరమేశ్వర్, కార్యదర్శి విక్రం రెడ్డిలు మాట్లాడుతూ సిద్దిపేటలో పనిచేసిన ప్రతి ఉద్యోగి అంకితభావంతో పనిచేస్తారని, ప్రభుత్వ ఉద్యోగుల సహకారంతోనే సిద్దిపేట అన్నింటి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. సులోచన మాట్లాడుతూ సిద్దిపేట పట్టణంలోనే తన పదవి కాలం అంతా గడిచిందని, అందరూ అధికారులు, సిబ్బంది తనకు సహాయ సహకారాలు అందించారని, కుటుంబ సభ్యుల సహకారంతోనే తన ఉద్యోగ బాధ్యతలను నిజాయితీతో నిర్వర్తించినట్లు తెలిపారు. అనంతరం వ్యవసాయ శాఖ, ఇతర సంఘాలు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆమె కుమారుడు భాస్కర్, అధికారులు, శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.



సీడీపీ నిధులు మంజూరు పట్ల బీఆర్ఎస్ నేతల హర్షం



నవతెలంగాణ-దుబ్బాక

దుబ్బాక నియోజకవర్గానికి సీడీపీ నిధులు రూ.1 కోటి 72 లక్షలు మంజూరవడం పట్ల బీఆర్ఎస్ నేతలు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం దుబ్బాక పట్టణ కేంద్రంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చింతల కృష్ణ, ఉమ్మడి మెదక్ జిల్లా టెలికాంబోర్డు మెంబర్ పాతూరి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడారు. సీఎం కేసీఆర్ సారథ్యంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం సబ్బండ వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. మెదక్ ఎంపీ, బీఆర్ఎస్ దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డి ప్రత్యేక చొరవతోనే దుబ్బాక నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని, ఆయన కృషి వల్లే నియోజకవర్గానికి ఈ నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ నిధులను తమ ఎంపీ తీసుకొస్తే ఇక్కడి ఎమ్మెల్యే తానే తెచ్చానని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. దుబ్బాక అభివృద్ధి ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి తోనే జరుగుతుందన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి హరీష్ రావు, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు పూజారి మల్లేశం, బీఆర్ఎస్ దుబ్బాక నియోజకవర్గ యువజన నాయకుడు దమ్మగోని ప్రశాంత్ గౌడ్ ఉన్నారు.

లచ్చపేటలో వైభవంగా రాజరాజేశ్వరుడి రథోత్సవం



నవతెలంగాణ-దుబ్బాక

దుబ్బాక పురపాలిక పరిధిలోని లచ్చపేట వార్డులో గల ప్రాచీన దేవాలయం శ్రీ రాజరాజేశ్వరాలయంలో శుక్రవారం స్వామి వారి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామివారికి అర్చనలు, అభిషేకాలు, పుష్పార్చన, విశేష పూజలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు ధరణినాథ్ శర్మ తెలిపారు. ప్రతి ఏటా రాఖీ పౌర్ణమి మరుసటి రోజున నిర్వహించే ఈ రథోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారన్నారు. లచ్చపేట ప్రధాన రహదారి వెంట స్వామివారి రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. పది, పదకొండు వార్డుల కౌన్సిలర్లు కూరపాటి బంగారయ్య, నందాల శ్రీజ శ్రీకాంత్, దేవాలయ కమిటీ సభ్యులు, వార్డు ప్రజలు, యువకులు, మహిళలు, పలువురు పాల్గొన్నారు.

స్టేట్ స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికైన అంగడి కిష్టాపూర్ విద్యార్థి



నవతెలంగాణ-మర్కుక్

మర్కుక్ మండలంలోని అంగడి కిష్టాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థి గార్నేపల్లి శ్రీహర్ష ఇటీవలే స్టేట్ స్పోర్ట్స్ స్కూల్ హకీంపేట్ పాఠశాలలో ఐదవ తరగతి ప్రవేశ ఎంపిక కొరకు నిర్వహించిన క్రీడా పోటీలలో సిద్దిపేట జిల్లా నుంచి పాల్గొని నేడు రాష్ట్ర స్థాయి క్రీడా పాఠశాలలో ఐదవ తరగతికి ఎంపికై అడ్మిషన్ పొందాడు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఓంకార్ రాధాకృష్ణ రామక్రిష్ణ, హారిక, చిన్నికృష్ణ, పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులు అభినందనలు తెలిపి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంలో ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను గుర్తించి, వారికి పోత్సహించటం జరుగుతుందన్నారు

మృతుల కుటుంబాలను ఎర్రోళ్ల శ్రీనివాస్ పరామర్శ



నవ తెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ పట్టణానికి చెందిన రిపోర్టర్ వేణు మాధవ్ మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను తెలంగాణ ఫారెస్ట్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్‌తో కలిసి వైద్య ఆరోగ్య సంస్థ మౌళిక సదుపాయాల సంస్థ చైర్మెన్ రోళ్ల శ్రీనివాస్ పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తూ పార్టీ పరంగా అదుకుంటామని భరోసా కల్పించారు. అదేవిధంగా దళిత సంఘం నాయకులు పొన్నాల కుమార్ తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాన్ని కూడా పరామర్శించారు. వారి వెంట, ఎంపీటీసీల ఫోరమ్ వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్, టౌన్ అధ్యక్షుడు నవాజ్ మీరా, మార్కుక్ , కొండపాక్ మండల అధ్యక్షులు కరుణాకర్ రెడ్డి, నూనె కుమార్, కౌన్సిలర్లు గోపాల్ రెడ్డి, బొగ్గుల చందు,మండల పార్టీ ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్, భారస నాయకులు ఉమర్, ఆత్మ కమిటీ డైరెక్టర్ సంతోష్ రెడ్డి, మంగోల్ అహ్మద్, శ్రీనివాస్, బారాస కార్యకర్తలు, తదితరులు ఉన్నారు..

అటెండర్ బండి నర్సింలుకు ఘన సన్మానం



నవతెలంగాణ -దుబ్బాక

దుబ్బాక పురపాలిక కేంద్రంలో గల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పిఏసిఎస్)లో గత 40 ఏళ్లుగా అటెండర్‌గా పనిచేస్తున్న బండి నర్సింలు రిటైర్మెంట్ సందర్భంగా శుక్రవారం పిఎసిఎస్ చైర్మన్ శేర్ల కైలాష్ ఆధ్వర్యంలో నర్సింలు దంపతులను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. సహకార సంఘానికి నర్సింలు అందించిన సేవలను కొనియాడారు. వైస్ చైర్మన్ కాల్వ నరేష్,సభ్యులు ఆస బుధవ్వ,పెనుకుల యాదగిరి,మణిపడిగే రేణుక,కొండి మైసా రెడ్డి,గుండవెల్లి ఎల్లారెడ్డి, కడ్మూరి ప్రభాకర్ రెడ్డి,కాసం బాల్ రెడ్డి, చెలుకుల మధుసూదన్ రెడ్డి,భానోత్ రాంజ్యా,బాలరాజు, ఆఫీసు సిఈఓ మోహన్,సిబ్బంది కరుణాకర్,వేణు పలువురున్నారు.

రైతులకు మష్రూమ్ పెంపకంపై శిక్షణ

నవతెలంగాణ-ములుగు

నర్సాపూర్ గ్రామం ములుగు మండల్ సిద్దిపేట్ డిస్టిక్ లోని కిసాన్ సేవా కేంద్రంలో ఇంటర్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్, సరిస్కా సేవా సంస్థ వారు నర్సాపూర్ గ్రామ వాసులకు కొంతకాలంగా మష్రూమ్ ట్రైనింగ్ ఇవ్వడం జరిగింది. ఇందులో భాగంగా నర్సాపూర్ నుంచి 90 మంది రైతులకు మష్రూమ్ ట్రైనింగ్ సర్టిఫికెట్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇంటటెక్ అఫీషియల్స్, నర్సాపూర్ గ్రామ సర్పంచ్ మల్లేష్ యాదవ్ , సరిగ్గా సేవా సంస్థను అధికారులు మేనేజర్ గగన్ శర్మ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సందీప్ అండ్ ట్రేడర్ బాలస్వామిలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా నర్సాపూర్ గ్రామ రైతులను ప్రోత్సహించడానికి వారు మష్రూమ్ పెంపకంపై మక్కువ చూపాలని అగ్రికల్చర్ సస్టైనబులిటీ ప్రోగ్రాం ద్వారా నర్సాపూర్ గ్రామ రైతులకు సోలార్ డ్రైయర్లు రెండు చొప్పున ఇవ్వడం జరిగింది. వారిని ప్రోత్సహించినందుకు, స్వయం ఉపాధి కోసం సహాయం చేసినందుకు నర్సాపూర్ గ్రామ రైతులు ఇంటర్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ అధికారులకు సరిస్కా సేవా సంస్థ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.



నల్ల బ్యాడ్జీలు ధరించిన ఉపాధ్యాయుల నిరసన

నవ తెలంగాణ-మిరుదొడ్డి

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో భూంపల్లి ఉన్నత పాఠశాలలో ఎస్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాచకొండ భూపాల్ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా పెన్షన్ ఉద్యోగి హక్కు-బిక్ష కాదు. సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి ఓ పి ఎస్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ఉపాధ్యక్షులు రాచకొండ భూపాల్,ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు దయాసాగర్ రెడ్డి, శ్రీనివాస్, రవిశేఖర్, ప్రకాష్, పద్మావతి, వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



వధూవరులను ఆశీర్వదించిన ప్రజాప్రతినిధులు





నవతెలంగాణ-తొగుట

మండలంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన బొగ్గుల బాలయ్య కుమారుడు స్వామి-శ్రవంతి పెళ్లి రాయపోల్‌లోని జీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో వివాహ వేడుకలు శుక్రవారం జరిగాయి. ఈ వివాహానికి మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కంకణాల నర్సింలు, రైతు బంధు అధ్యక్షుడు బండారు స్వామి గౌడ్, ఆత్మ కమిటీ డైరెక్టర్ సుతారి రాములు, నాయకులు బండారు కిష్టాగౌడ్, పులిగారి లక్ష్మణ్, సుతారి రాములు, సుతారి రాంబాబు, మిద్దె సురేష్, రాజు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-జగదేవపూర్

జగదేవపూర్ మండల కేంద్రంలో గల ఓ ప్రైవేట్ గార్డెన్స్‌లో జరిగిన సిద్దిపేట జిల్లా ముదిరాజ్ సంఘం యువజన విభాగం ప్రధాన కార్యదర్శి భాను దంపతుల వివాహానికి శుక్రవారం ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, ఎఫ్డిసి చైర్మన్ ప్రతాపరెడ్డిలు హాజరై ఆశీర్వదించారు. వారితో పాటు గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ ఎన్. సి. రాజమౌళి,గజ్వేల్ జడ్పిటిసి పంగ మల్లేశం, జగదేవపూర్ మండల అధ్యక్షులు పనుగాట్ల శ్రీనివాస్ గౌడ్,నాయకులు శ్రీనివాస్ రెడ్డి,వార్డు సభ్యులు కొంపల్లి మహేష్,మాజీ సర్పంచ్ కొంపెల్లి కరుణాకర్,ఇటిక్యాల సర్పంచ్ చంద్ర శేఖర్ పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష సిబ్బందిని రెగ్యులరైజేషన్ చేయాలి

జేఏసీ మండలాధ్యక్షుడు పి.గణేష్

నవ తెలంగాణ-దుబ్బాక

సమగ్ర శిక్ష లో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగుల్ని రెగ్యులరైజేషన్ చేయాలని సమగ్ర శిక్ష జేఏసీ దుబ్బాక మండలాధ్యక్షుడు పి.గణేష్ కోరారు. శుక్రవారం దుబ్బాక పట్టణ కేంద్రంలో సమగ్ర శిక్షలో పనిచేస్తున్న మండల పరిధిలోని అన్ని విభాగాల సిబ్బంది సమావేశమయ్యారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. సమగ్ర శిక్ష జెఏసి మండలాధ్యక్షుడుగా పి.గణేష్,పి.స్వాతి, ఉపాధ్యక్షుడుగా అజ్జ రాజశేఖర్,ప్రధాన కార్యదర్శిగా వి.శ్రీధర్,వి. నాగరాజు,సహాయ ప్రధాన కార్యదర్శిగా మల్లికార్జున్ కే,ఆర్.స్వామి, కోశాధికారిగా టి.నవీన్ కుమార్, సలహాదారులుగా కే.వరలక్ష్మి, పి.యాదగిరి, కే.శ్రీనివాస్ గౌడ్, ఏ.సిరివెన్నెలలను ఎన్నుకోవడం జరిగిందన్నారు. అనంతరం అధ్యక్షుడు గణేష్ మాట్లాడుతూ, మండల వ్యాప్తంగా 54 మంది సిబ్బంది సమగ్ర శిక్షలో పనిచేస్తున్నారని, గత 15 ఏళ్లుగా విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న తమను గుర్తించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి తమను రెగ్యులరైజేషన్ చేయాలన్నారు.అలాగే తమకు ఉద్యోగ భద్రత, హెల్త్ కార్డు, ప్రమాద బీమా ప్రకటించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.సమగ్ర శిక్ష సిబ్బంది పాల్గొన్నారు.



సీఎం సహా నిధి చెక్కు అందజేత



నవ తెలంగాణ-గజ్వేల్

ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను ఎఫ్ డి సి చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి సహకారంతో పలువురికి అందించినట్లు మూడో వార్డు కౌన్సిలర్ మరికంటి వరలక్ష్మి కనకయ్య తెలిపారు. శుక్రవారం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ పరిధిలో 3వ వార్డుకు చెందిన గుజ్జెటి పుండరీకంకు రూ.37 వేలు, గుజ్జేటి సాయినాథ్‌కు రూ.19వేల విలువ చేసే చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నవాజ్ మీరా, పట్టణ ఉపాధ్యక్షులు డాక్టర్ ఎల్లేశం, మూడోవాడు అధ్యక్షులు శ్రీరామ్ మల్లేశం, డాక్టర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజుల సంక్షేమానికి కృషి చేస్తున్న ప్రభుత్వం



నవతెలంగాణ-మర్కుక్

ముదిరాజుల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని బీఆర్ఎస్ బీసీ సెల్ మర్కుక్ మండలాధ్యక్షులు మ్యాకల కనకయ్య ముదిరాజ్ అన్నారు. శుక్రవారం నవతెలంగాణతో మాట్లాడుతూ గత 60 సంవత్సరాల క్రితం ముదిరాజుల సంక్షేమం కోసం ఏ ప్రభుత్వాలు పని చేయలేదని, నేడు ముఖ్యమంత్రి కెసిఆర్ నేతృత్వంలో ముదిరాజుల కోసం కమ్యూనిటీ భవనాలను కేటాయించారని అన్నారు.తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ప్రతి గ్రామంలో చెరువులు, కుంటలు నిండుగా ఉన్నాయని, ఎనాడు కనివిని ఎరగని రీతిలో 15 కేజీల చేపలు దొరుకుతున్నాయని తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



నవ తెలంగాణ-దౌల్తాబాద్

మండల కేంద్రమైన దౌల్తాబాద్‌లోని శ్రీ రామ దాసు చెరువులో పడి ఆత్మహత్య చేసుకున్న సూర లక్ష్మి కుటుంబాన్ని పరామర్శించి దుబ్బాక ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్ రావు ఆదేశాల మేరకు శుక్రవారం బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందించారు. గొల్ల(బోరింగ్) శ్రీను,మార్కంటి నర్సింలు, కుర్మ గణేష్, శేఖర్, ఆంజనేయులు, రమేష్,మల్లేష్ పాల్గొన్నారు.

నవతెలంగా- దౌల్తాబాద్

కుటుంబ పోషణ భారమై ఆత్మహత్య చేసుకున్న సూర లక్ష్మి కుటుంబాన్ని మాజీ సర్పంచ్ ఆది వేణుగోపాల్ పరామర్శించి రూ. 5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మాజీమంత్రి చెరుకు ముత్యంరెడ్డి తనయుడు చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు తక్షణ సహాయంగా అందజేసినట్లు వేణుగోపాల్ తెలిపారు. కాంగ్రెస్ నాయకులు మల్లయ్య, డా కొల్ల ఆంజనేయులు గౌడ్, శ్రీనివాస్, మరికంటి మల్లేష్ తదితరులు ఉన్నారు.

బీజేపీ నాయకుల అక్రమ అరెస్టులు సిగ్గుచేటు

బీజేపీ గజ్వేల్ నియోజకవర్గ కో కన్వీనర్ బండారు మహేష్

నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్

బీఆర్ఎస్ ప్రభుత్వం బీజేపీ నాయకులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం సిగ్గుచేటని బీజేపీ గజ్వేల్ నియోజకవర్గం కోకన్వీనర్ మహేష్ అన్నారు. శుక్రవారం కామారెడ్డి బీజేపీ నాయకులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి అక్రమ అరెస్టును ఆయన తీవ్రంగా ఖండించారు. గజ్వేల్ అంటే అభివృద్ధి అభివృద్ధి అంటే గజ్వేల్ అని చెప్పుకునే రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రాతినిత్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గన్ని ఎం అభివృద్ధి సాధించారో నిరూపించాలన్నారు. అభివృద్ధి కేవలం మాటలల్లో తప్ప చేతల్లో లేదన్నారు. 4 రోడ్లు వేసి, 4 భవనాలు కట్టినంత మాత్రాన అభివృద్ధి అయిపోయినట్లేన అని ప్రశ్నించారు. ఎంతోమంది నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు అందలేదన్నారు. మల్లన్న సాగర్ బాధితులకు న్యాయం జరగలేదని, నియోజకవర్గంలో ఎవరికి ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ములుగు మండల అధ్యక్షులు పల్లె రమేష్ యాదవ్, బీజేపీ నాయకులు తిరుపతి రెడ్డి, ఆనంద సాయి గౌడ్, నవీన్, ఢిల్లీ రమేష్, మధు, తదితరులు పాల్గొన్నారు.

